RNI NO: TELTEL2023/46567

# అక్షర వేదం

తెలుగు దినపత్రిక

ప్రతి అక్షరం ప్రజల పక్షం  AKSHARA VEDAM TELUGU DAILY

సంచిక : 318 | సంపుటి : 02 | మంగళవారం | 7-10-2025 | పేజీలు -8 | వెల: రూ. 05.00

విలేకరులు కావలెను

తెలంగాణ ప్రాంతం అన్ని జిల్లాల నుండి స్టాఫ్ రిపోర్టర్లు, జిల్లా ఇన్చార్జులు, మండల రిపోర్టర్లు అర్జెంటుగా కావలెను అనుభవం ఉన్నా లేకున్నా తీసుకోబడును

ఎడిటర్ -పందిళ్ల రవీందర్ (9030653934)

తెలంగాణ స్టేట్ బ్యూరో పొన్నం ప్రసాద్ గౌడ్ 9666992524

# మోగిన బీహార్ ఎన్నికల నగారా

## నవంబర్ 6, 11 తేదీల్లో ఎన్నికలు




- రెండు విడుతల్లో ఎన్నికల నిర్వహణ
- నవంబర్ 14న కౌంటింగ్..అదేరోజు ఫలితాలు
- 90 వేల పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు
- ఈవీఎంలపై తొలిసారి అభ్యర్థుల కలర్ ఫొటోలు
- ఓటు వేయనున్న 7.43 కోట్ల మంది ఓటర్లు అందులో 3.92 కోట్ల పురుషులు,
- 3.50 కోట్ల మహిళా ఓటర్లు షెడ్యూల్ విడుదల చేసిన కేంద్ర ఎన్నికల సంఘం

న్యూఢిల్లీ,

బిహార్ శాసనసభ ఎన్నికలకు నగారా మోగింది. రెండు విడతల్లో పోలింగ్ నిర్వహిస్తారు. నవంబర్ 6, నవంబర్ 11న పోలింగ్ జరగనుంది. నవంబర్ 14న ఓట్ల లెక్కింపు చేపట్ట నున్నారు. కేంద్ర ఎన్నికల సంఘం సోమవారం ఈ మేరకు షెడ్యూల్ ఖరారు చేసింది. పోలింగ్ తేదీలు, ఇతర వివరాలను కేంద్ర ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేశ్ కుమార్ సోమవారం మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. బిహార్ లో మొత్తం 243 శాసనసభ స్థానాలున్నాయి. ప్రస్తుత అసెంబ్లీ గడువు -మిగతా 2 లో






# సుప్రీంకోర్టులో తీవ్ర కలకలం

- సనాతన ధర్మాన్ని అవమానించారని నినాదాలు
- సీజేఐ గవాయ్‌పై షూ విసిరేందుకు యత్నించిన లాయర్

న్యూఢిల్లీ

దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు లో షాకింగ్ ఘటన చోటు చేసుకుంది. భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) బీఆర్ గవాయ్ పై ఓ లాయర్ దాడికి యత్నించారు. సోమవారం ఉదయం సుప్రీంకోర్టులో కోర్టు కార్యకలాపాలు జరుగుతుండగా సీజేఐపై ఓ లాయర్ షూ విసిరేందుకు యత్నించాడు. వెంటనే అప్రమత్తమైన భద్రతా సిబ్బంది సదరు లాయర్‌ను అడ్డుకుని బయటకు తీసుకెళ్లారు.సోమవారం ఉదయం ఓ కేసు విచారణ సందర్భంగా ఈ ఘటన చోటు చేసుకుంది. విచారణ సమయంలో డయాస్ వద్దకు వెళ్లిన సదరు లాయర్.. షూ తీసి సీజేఐపైకి -మిగతా 2 లో

# బీసీ రిజర్వేషన్లపై హైకోర్టులోనే తేల్చుకోండి

## సుప్రీంకోర్టులో తెలంగాణ ప్రభుత్వానికి ఊరట

- బీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా పిటిషన్ కొట్టివేత
- హైకోర్టులో కేసు పెండింగ్‌లో ఉండగా విచారించలేం
- సుప్రీం ధర్మాసనం స్పష్టీకరణ

న్యూఢిల్లీ

సుప్రీంకోర్టులో తెలంగాణ ప్రభుత్వానికి ఊరట లభించింది. బీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్‌ను అత్యున్నత న్యాయస్థానం కొట్టివేసింది. ఈ అంశం హైకోర్టులో పెండింగ్‌లో ఉన్నందున విచారణకు స్వీకరించలేమని జస్టిస్ విక్రమ్‌నాథ్ నేతృత్వంలోని ధర్మాసనం స్పష్టం చేసింది. హైకోర్టులో ఇదే అంశంపై రెండు పిటిషన్లు పెండింగ్‌లో ఉన్నాయని రాష్ట్ర ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాదులు సిద్దార్థ దవే, అభిషేక్ సింఘ్వీ, ఏడీఎన్ రావు సుప్రీంకోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఆర్టికల్ 32 కింద పిటిషన్ ఎందుకు ఫైల్ చేశారని పిటిషనర్ తరఫు న్యాయవాదిని జస్టిస్ విక్రమ్‌నాథ్ ధర్మాసనం ప్రశ్నించింది. హైకోర్టు స్టే ఇవ్వనందున సుప్రీంకోర్టుకు వచ్చామని -మిగతా 2 లో







# నవంబర్ 11న జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక

- 14న కౌంటింగ్..
- అదేరోజు ఫలితం ప్రకటన

న్యూఢిల్లీ,

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న జూబ్లీహిల్స్ ఉపఎన్నిక షెడ్యూల్ వచ్చింది. ఈ మేరకు జూబ్లీహిల్స్ ఎన్నికల షెడ్యూల్‌ను సోమవారం ఎన్నికల కమిషన్ విడుదల చేసింది. నవంబర్ 11న పోలింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపింది. అనంతరం నవంబర్ 14న ఓట్ల లెక్కింపు చేస్తున్నట్లు పేర్కొంది. బీహార్ ఎన్నికల షెడ్యూల్‌తో పాటు జూబ్లీహిల్స్ తదితర రాష్ట్రాల్లో పలు అసెంబ్లీ ఉప ఎన్నికలను నిర్వహించనున్నారు. ఈనెల 13న జూబ్లీహిల్స్ ఉపఎన్నిక నోటిఫికేషన్ విడుదల కానుంది. నామినేషన్లకు -మిగతా 2 లో




# రాజస్థాన్‌లో ఘోరం

- జైపూర్ ప్రభుత్వ ఆస్పత్రి ఐసియులో చెలరేగిన మంటలు
- 8మంది మృతి, ముగ్గురి పరిస్థితి విషమం
- ఉన్నత స్థాయి దర్యాప్తు కమిటీకి ఆదేశాలు

జైపూర్

రాజస్థాన్‌లో ఘోరం జరిగింది. జైపూర్‌లోని అతిపెద్ద ప్రభుత్వ ఆస్పత్రి అయిన సవాయ్ మాన్‌సింగ్ (ఎస్ఎంఎస్) ఆస్పత్రిలోని ట్రామా సెంటర్ ఐసియులో పెద్దఎత్తున మంటలు చెలరేగడంతో ముగ్గురు మహిళలుసహా ఎనిమిది మంది రోగులు ప్రాణాలు కోల్పోయారు. మరో ముగ్గురి పరిస్థితి విషమంగా వుంది. ఆదివారం రాత్రి పొద్దుపోయిన తర్వాత ఈ దుర్ఘటన చోటు చేసుకుంది. రాత్రి 11.20గంటల సమయంలో ఐసియులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఐసియు వార్డులోని స్టోర్ రూమ్‌లో షార్ట్ సర్క్యూట్ ఈ దుర్ఘటనకు కారణమై వుంటుందని అధికారులు అనుమానిస్తున్నారు. ఈ స్టోర్ రూమ్‌లో కాగితాలు, వైద్య సామాగ్రి, బ్లడ్ శాంపుల్స్ ట్యూబులు వున్నాయి. ఒక్కసారిగా పెద్దఎత్తున లేచిన మంటలు క్షణాల్లో వార్డును చుట్టుముట్టేశాయి. దాంతో ఆ వార్డంతా పొగ కమ్ముకుంది. రోగులు భయకంపితులయ్యారు. ఈ సంఘటన చోటు చేసుకున్న సమయంలో ఐసియులో, సెమీ ఐసియులో 18మంది రోగులు వున్నారు. అందులో 11మంది ఒకే వార్డులో వున్నారు. అక్కడే మంటలు -మిగతా 2 లో

# సుప్రీం కోర్టు తీర్పు శుభపరిణామం



- 42శాతం రిజర్వేషన్లకు కట్టుబడి ఉన్నాం
- ఢిల్లీలో మీడియాతో మంత్రులు భట్టి, పొన్నం

న్యూఢిల్లీ,

సుప్రీం కోర్టు తీర్పు శుభ పరిణామం అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు. 42 శాతం బీసీ రిజర్వేషన్లు ఆపాలని సుప్రీంకోర్టులో వేసిన కేసును న్యాయస్థానం కొట్టి వేయడాన్ని స్వాగతిస్తున్నాం.. కాంగ్రెస్ పార్టీ, రాష్ట్ర ప్రభుత్వం 42 శాతం బీసీలకు రిజర్వేషన్లు ఇచ్చే విషయంలో అన్ని రకాలుగా -మిగతా2 లో

## రేవంత్ చీఫ్ మినిస్టర్ కాదు ...

# కటింగ్ మాస్టర్

- రిబ్బన్ కట్ చేయడం లేదంటే...పథకాలు కట్ చేయడం
- మల్లన్న సాగర్ నుంచి నీళ్లు ఎలా తరలిస్తారు
- సిఎం రేవంత్‌పై ఎమ్మెల్యే హరీష్ రావు విమర్శలు

హైదరాబాద్,

రేవంత్ చీఫ్ మినిస్టర్ కాదు అని, కటింగ్ మాస్టర్ అని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి హరీష్ రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ మేరకు సిఎం తీరుపై ఎద్దేవా చేశారు. రేవంత్ జేబులో కత్తెర పెట్టుకొని మాజీ సీఎం కేసీఆర్ చేసిన పనులకు రిబ్బన్ కట్ చేస్తున్నాడని విమర్శించారు. రిబ్బన్ కత్తిరించడం లేదంటే కేసీఆర్ ఇచ్చిన పథకాలు కట్



చేయడమే రేవంత్ పని అని పేర్కొన్నారు. కాళేశ్వరం కూలిందని చెబుతున్న సీఎం -మిగతా 2 లో

# పరిశ్రమలు పెట్టే వారికి అన్నిరకాల మద్దతు


## హైదరాబాద్‌లో పరిశ్రమ ఏర్పాటుకు ఎలి లిల్లీ అంగీకారం



- రూ.9000 కోట్లు భారీ పెట్టుబడులకు కంపెనీ నిర్ణయం
- సీఎం రేవంత్‌తో పరిశ్రమ ప్రతినిధుల భేటీ

హైదరాబాద్,

తెలంగాణలో పరిశ్రమలు పెట్టేవారికి ప్రభుత్వం అన్ని రకాలుగా మద్దతిస్తుందని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. అమెరికాకు చెందిన ప్రముఖ ఫార్మా సంస్థ ఎలి లిల్లీ ప్రతినిధులు సీఎంతో భేటీ అయ్యారు. ఈ భేటీకి ఆ సంస్థ అధ్యక్షుడు ప్యాట్రిన్ జాన్సన్, లిల్లీ ఇండియా అధ్యక్షుడు విన్సెలో టుకర్, మంత్రి శ్రీధర్ బాబు, ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి సంజయ్ తదితరులు హాజరయ్యారు. హైదరాబాద్‌లో పరిశ్రమ ఏర్పాటుకు ఎలి లిల్లీ ముందుకొచ్చింది. రూ.9 వేల కోట్లతో ఎలాంటు, క్వాలిటీ సెంటర్ ఏర్పాటుకు సంసిద్ధత వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా ఆ సంస్థను -మిగతా 2 లో



# అలా చేయకపోతే భారీ రక్తపాతమే

- ఇజ్రాయెల్, హమాస్‌కు ట్రంప్ కీలక హెచ్చరికలు

న్యూఢిల్లీ

గాజా విషయంలో ఇజ్రాయెల్, హమాస్ కు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. గాజా శాంతి ప్రణాళిక విషయంలో వెంటనే ఒక నిర్ణయానికి రాకపోతే భారీ రక్తపాతం చూడాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈజిప్టు వేదికగా ఇరు పక్షాల మధ్య కీలక చర్చలు జరగనున్న నేపథ్యంలో ట్రంప్ ఈ హెచ్చరికలు చేశారు.'శతాబ్దాల నాటి ఈ సంఘర్షణను నేను నిశితంగా గమనిస్తున్నానే ఉన్నాను. సమయం చాలా విలువైంది. గాజా శాంతి ప్రణాళికపై ఇజ్రాయెల్, హమాస్ త్వరగా ముందుకు సాగాలి. అలా చేయడంలో విఫలమైతే భారీ రక్తపాతం జరుగుతుంది ' అంటూ ట్రూత్‌లో పోస్టు పెట్టారు. హమాస్‌తో పాటు ఇతర అరబ్, ముస్లిం దేశాలతో జరిపిన చర్చలు సఫలమయ్యాయని, బందీల విడుదల, గాజాలో యుద్ధం ముగింపు వంటి అంశాలపై సానుకూల వాతావరణం నెలకొందని ఈ సందర్భంగా ట్రంప్ తెలిపారు. నేడు ఈజిప్టు వేదికగా తుది -మిగతా 2 లో

# ఎంఐఎం మాకు ఫ్రెండ్లీ పార్టీ

- జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో గెలుస్తాం
- టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్



హైదరాబాద్,-

జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నికపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఎంఐఎం పార్టీ కాంగ్రెస్‌కు ఫ్రెండ్లీ పార్టీ అని చెప్పారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ఎంఐఎం తమకు పూర్తి మద్దతు ఇస్తుందన్నారు. జూబ్లీహిల్స్‌లో విజయం తమదే అని పీసీసీ చీఫ్ ధీమా వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు ఈరోజు షెడ్యూల్ విడుదలైంది. నవంబర్ 11న ఉప ఎన్నిక పోలింగ్, నవంబర్ 14న ఓట్ల లెక్కింపు జరగనున్నట్లు ఈసీ వెల్లడించింది. మాగంటి గోపీనాథ్ మృతితో జూబ్లీహిల్స్‌లో ఉప ఎన్నిక జరగనున్న విషయం తెలిసిందే. 'రెండు మూడు రోజుల్లో జూబ్లీహిల్స్ అభ్యర్థి పేరు ఖరారవుతుంది. అభ్యర్థి ఎంపికపై సీఎం రేవంత్ రెడ్డితో -మిగతా 2 లో

# బీసీ రిజర్వేషన్లపై హైకోర్టులోనే తేల్చుకోండి

(మొదటి తరువాయి)

పిటిషనర్ పేర్కొన్నారు. హైకోర్టు స్టే ఇవ్వకుంటే సుప్రీంకోర్టుకు వచ్చేస్తారా? అని ధర్మాసనం ప్రశ్నించింది. అనంతరం పిటిషన్‌ను జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతా ధర్మాసనం కొట్టివేసిందివసంది. దీంతో బీసీల రిజర్వేషన్లపై సుప్రీంకోర్టులో తెలంగాణ ప్రభుత్వానికి బిగ్ రిలీఫ్ లభించింది. అంతేగాకుండా బీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్‌ని విచారించడానికి నిరాకరించింది సుప్రీంకోర్టు. తెలంగాణ హైకోర్టులో ఇదే అంశంపై రెండు పిటిషన్లు పెండింగ్‌లో ఉన్నాయని రాష్ట్ర ప్రభుత్వం తరపు సీనియర్ న్యాయవాదులు తెలిపారు. హైకోర్టులో పిటిషన్లు పెండింగ్‌లో ఉన్నందున... విచారణకు స్వీకరించలేమని ధర్మాసనం స్పష్టం చేసింది. ఆర్టికల్ 32 కింద దాఖలు చేసిన రిట్ పిటిషన్‌పై సుప్రీంకోర్టు ఎలా జోక్యం చేసుకుంటుందని ప్రశ్నించింది ధర్మాసనం. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు, జీవో నెంబర్-9ని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో వంగ గోపాల్ రెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై న్యాయస్థానంలో సోమవారం విచారణ జరిగింది. ఈ విచారణకు స్వయంగా తెలంగాణ మంత్రులు మల్లు భట్టి విక్రమార్క, పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి హాజరయ్యారు. వీరు సీనియర్ న్యాయవాదులతో ఆదివారం నుంచి మంతనాలు జరిపారు. ప్రభుత్వ వాదనలను గట్టిగా వినిపించాలని కోరారు. దీంతో ఇక ప్రభుత్వం ఎన్నికలకు వెళ్లేందుకు దాదాపుగా మార్గం సుగమమయ్యిందని భావిస్తున్నారు.

## నవంబర్ 11న జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక

(మొదటి తరువాయి)

ఈనెల 21 వరకు గడువు విధించనున్నట్లు సమాచారం. అలాగే స్వీకరించిన నామినేషన్లను 22వ తేదీన పరిశీలన చేయనున్నారు. ఈ నేపథ్యంలో నగరంలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. బీహార్‌తో పాటే నవంబర్ 14న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. జూబ్లీహిల్స్ పరిధిలో మొత్తం 3,92,669 మంది ఓటర్లు ఉన్నారు. మాగంటి గోపీనాథ్ అకాల మరణంతో ఇక్కడ ఉప ఎన్నిక నిర్వహిస్తున్నారు. నోటిఫికేషన్ విడుదల: అక్టోబర్ 13, నామినేషన్లకు తుది గడువు: అక్టోబర్ 21, నామినేషన్ల పరిశీలన: అక్టోబర్ 22, నామినేషన్ల ఉపసంహరణకు తుది గడువు: అక్టోబర్ 24 పోలింగ్ తేదీ: నవంబర్ 11, ఓట్ల లెక్కింపు : నవంబర్ 14న ఉంటుంది.

## సుప్రీంకోర్టులో తీవ్ర కలకలం

(మొదటి తరువాయి)

విసిరేందుకు ప్రయత్నించారు. వెంటనే అప్రమత్తమైన భద్రతా సిబ్బంది లాయర్‌ని అడ్డుకుని బయటకి లాక్కెళ్లారు.అనంతరం పోలీసులకు అప్పగించారు. ఆ సమయంలో ఆ న్యాయవాది 'సనాతనానికి జరిగే అవమానాన్ని మేము సహించము..' అంటూ గట్టిగా అరిచారు. ఈ ఘటనతో కోర్టులో ఒక్కసారిగా గందరగోళం నెలకొంది. స్పందించిన సీజేఐ ఈ విషయాన్ని తనని ప్రభావితం చేయదని పేర్కొన్నారు. మిగతా లాయర్లు తమ వాదనలు కొనసాగించాలని ఆదేశించారు.

## ఎంఐఎం మాకు ఫ్రెండ్లీ పార్టీ

(మొదటి తరువాయి)

మాట్లాడుతున్నాం. స్థానిక సంస్థల ఎన్నికల్లో పరిస్థితులను బట్టి మిత్రపక్షాలకు టికెట్లు ఇస్తాం. సీపీఎం, సీపీఐ, జనసమితి అభ్యర్థులకు టికెట్లు ఇచ్చే అవకాశం ఉంది. డిసెంబర్ నెలాఖరు వరకు కార్పొరేషన్ పదవులు భర్తీ చేస్తాం. బీసీ రిజర్వేషన్‌పై మేం పడే తపన ప్రజలు అర్థం చేసుకుంటున్నారు. కామారెడ్డిలో బహిరంగ సభ ఉంటుంది. అక్టోబర్ నెలాఖరులో కామారెడ్డి సభ ఉంటుంది' అని పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ చెప్పారు.

## అలా చేయకపోతే భారీ రక్తపాతమే

(మొదటి తరువాయి)

చర్చలు జరగనున్నట్లు వెల్లడించారు. అంతకుముందు తొలి దశలో భాగంగా గాజాలోని బలగాల ఉపసంహరణకు ఇజ్రాయెల్ అంగీకరించినట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఇందుకు సంబంధించిన సమాచారాన్ని హమాస్‌కు కూడా పంపించినట్లు ఆయన తన సామాజిక మాధ్యమం ట్రూత్ సోషల్ వేదికగా శనివారం వెల్లడించారు. హమాస్ నుంచి ఆమోదం లభించిన వెంటనే గాజాలో కాల్పుల విరమణ అమలులోకి వస్తుందని, ఇజ్రాయెలీ బందీలు, పాలస్తీనా బందీల మార్పిడి ప్రారంభమవుతుందని ట్రంప్ తెలిపారు. తొలి దశ ఉపసంహరణకు పరిస్థితులను సానుకూలం చేస్తామని, దీంతో 3,000 సంవత్సరాల పాలస్తీనా సంక్షోభానికి ముగింపు లభించగలదని ట్రంప్ ఆశాభావం వ్యక్తం చేశారు.

## రాజస్థాన్‌లో ఘోరం

(మొదటి తరువాయి)

తలెత్తాయి. సమాచారం అందిన వెంటనే అగ్నిమాపక దళ అధికారులు వచ్చినా అగ్నికీలలు, దట్టమైన పొగ సహాయక చర్యలకు ఆటంకం కలిగించాయి. కుటుంబ సభ్యులు, ఆస్పత్రి సిబ్బంది సహాయంతో కిటికీలు, తలుపులు బద్దలు కొట్టి చాలామంది రోగులను కాపాడారు. వీధిలో పరిచిన పరుపులపై వెంటనే రోగులను పడుకోబెట్టి, వారికి ఫస్ట్ ఎయిడ్‌గా ఆక్సిజన్‌ను అందించారు. ఈ ఘటనతో ఆస్పత్రిలో తీవ్ర గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. ఐసియులో విషమంగా వున్న రోగు లను తరలించడానికి సిబ్బంది చాలా శ్రమపడాల్సి వచ్చింది. మంటలను అదుపు చేయడానికి గంటన్నర పట్టింది. ట్రామా సెంటర్ నోడల్ అధికారి డాక్టర్ అనురాగ్ థకడ్ మాట్లాడుతూ, ఆరుగురు రోగులు మంటల్లో చిక్కుకుపోయారని తెలిపారు.

ఆస్పత్రి భద్రతా ఏర్పాట్లపై అనుమానాలు

ఈ సంఘటనతో ఆస్పత్రిలోని భద్రతా ఏర్పాట్లుపై తీవ్రమైన సందేహాలు, ప్రశ్నలు తలెత్తుతు న్నాయి. మంటలు వచ్చిన వెంటనే ఫైర్ అలారమ్ వ్యవస్థ సరిగా పనిచేయలేదని అక్కడి వారు చెబుతు న్నారు. పైగా ఆక్సిజన్ లైన్‌ను అనుసంధానించడంలో కూడా జాప్యం జరిగింది. తగిన మొత్తంలో అగ్నిమాపక పరికరాలు లేకపోవడంతో మంటలు త్వరిత గతిన వ్యాప్తిచెందడానికి కారణమైంది.

కుటుంబాల ధర్నా

ఈ ప్రమాదం పట్ల రోగుల కుటుంబాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఆస్పత్రి వెలుపల ధర్నా కూడా నిర్వహించారు. పాలనా యంత్రాంగం నిర్లక్ష్యం వల్లే ఇదంతా జరిగిందని వారు విమర్శించారు.

**ముఖ్యమంత్రి విచారం.. ఉన్నత స్థాయి దర్యాప్తు కమిటీకి ఆదేశాలు**

ప్రమాదం గురించి తెలిసిన వెంటనే అర్ధరాత్రి దాటిన తర్వాత ముఖ్యమంత్రి భజన్‌లాల్ శర్మ ఆస్పత్రికి చేరుకుని పరిస్థితులను సమీక్షించారు. గాయపడిన వారికి తక్షణమే చికిత్స అందించడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇది చాలా విషాదకరమైన, ఆందోళన కలిగించిన సంఘటన అని సిఎం అభివర్ణించారు. ఇందుకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. జరిగిన ఘటనపై సవివరమైన నివేదిక ఇవ్వాల్సిందిగా ఆదేశించారు. సంఘటన తీవ్రతను దృష్టిలో వుంచుకుని ఉన్నత స్థాయి దర్యాప్తు కమిటీకి ఆదేశాలు జారీ చేశారు.

# మోగిన బీహార్ ఎన్నికల నగారా

(మొదటి తరువాయి)

వచ్చే నెల చివరి వారంతో ముగియనుంది. బిహార్‌లో నిర్వహించిన ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ఎస్ఐఆర్‌పై జ్ఞానేశ్ కుమార్ స్పందించారు ఎస్ఐఆర్ ముసాయిదాను ఆగస్టు ఒకటిన విడుదల చేశాం. దానిని అన్ని రాజకీయ పార్టీలకు అందజేశాం. అభ్యంతరాలు ఉంటే వ్యక్తం చేసే అవకాశం ఇచ్చాం. తుది జాబితాను సెప్టెంబర్ 30న ప్రకటించాం. ఇప్పటికీ అభ్యంతరాలు ఉంటే స్వీకరిస్తాం అని తెలిపారు. ఈ ఎన్నికలను ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పారదర్శకంగా నిర్వహిస్తామని జ్ఞానేశ్ చెప్పారు. 90 వేల పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేస్తామన్నారు. 7.43 కోట్ల మంది ఓటు వేయనున్నారని, వారిలో 3.92 కోట్ల మంది పురుషులు, 3.50 కోట్ల మహిళా ఓటర్లు ఉన్నారని చెప్పారు. రద్దీ నిర్వహణ కోసం ఒక్కో బూత్‌లో 1200 మంది ఓటు వేసేలా ఏర్పాట్లు చేశామని తెలిపారు. ఈవీఎంలపై తొలిసారి అభ్యర్థుల కలర్ ఫొటోలు వేసే ప్రక్రియను ఈ ఎన్నికలతోనే ప్రారంభిస్తున్నామని తెలిపారు. రెండు దశల్లో మొత్తం 243 అసెంబ్లీ స్థానాలకు పోలింగ్ జరగనుంది. నవంబర్ 22లోపు ఎన్నికల ప్రక్రియ పూర్తి చేస్తామని సీఈసీ చెప్పింది. ఓటర్ల జాబితాపై అభ్యంతరాలను పరిగణలోకి తీసుకుని, ఆగస్టు 1న ఓటర్ల తుది జాబితా ప్రకటించామని సీఈసీ సభ్యులు తెలిపారు. బిహార్‌లో




మొత్తం 7.42 కోట్ల మంది ఓటర్లు ఉన్నారని, ఓటర్ల జాబితాలో సవరణలకు ఇంకా అవకాశం ఉందని కూడా సీఈసీ తెలిపింది. నామినేషన్లకు 10 రోజుల ముందు కూడా.. ఓటరు జాబితాలో మార్పులు చేసుకోవచ్చని సూచించింది. ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నామని,ఈసారి ఎన్నికల ప్రక్రియ మరింత సులభతరం చేస్తున్నామని సీఈసీ వెల్లడించింది. బిహార్ ఎన్నికల కోసం 90,712 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నామని, ప్రతి పోలింగ్ స్టేషన్‌లోనూ వెబ్‌క్యాస్టింగ్ ఉంటుందని సీఈసీ స్పష్టం చేసింది. బీహార్ మొదటి విడత ఎన్నికల గెజిట్ నోటిఫికేషన్ అక్టోబర్ 10న వస్తుంది. నామినేషన్ల దరఖాస్తుకు చివరి తేదీ అక్టోబర్ 17. నామినేషన్ ఉపసంహరణ గడువు అక్టోబర్ 20తో ముగుస్తుంది. నవంబర్ 6 తేదీన మొదటి విడత ఎన్నికలు జరుగుతాయి. ఇక, రెండో విడత ఎన్నికలకు గెజిట్ నోటిఫికేషన్ అక్టోబర్ 13న విడుదల చేస్తారు. నామినేషన్ల దరఖాస్తుకు అక్టోబర్ 20 చివరి తేదీ. నామినేషన్ల ఉపసంహరణకు అక్టోబర్ 23 వరకూ అవకాశం ఉంటుంది.తుది దశ ఎన్నికల పోలింగ్ నవంబర్

11న జరుగుతుంది. నవంబర్14న కౌంటింగ్ చేపట్టి అదేరోజు ఎన్నికల ఫలితాలు విడుదల చేస్తారు. వృద్దులు, దివ్యాంగ ఓటర్లకు ఇంటి దగ్గరే ఓటింగ్ అవకాశం కల్పిస్తున్నామని కేంద్ర ఎన్నికల సంఘం తెలిపింది. ఎలాంటి ఫిర్యాదుకైనా 1950 నెంబర్‌కు ఫోన్ చేసే అవకాశం ఉంటుందని, సోషల్ మీడియాలో తప్పుడు పోస్టులు పెడితే కఠిన చర్యలు తప్పవని ఎన్నికల సంఘం హెచ్చరించింది. బిహార్ ఎన్నికల నుంచి కొత్తగా 17 సంస్కరణలు తీసుకొస్తున్నామని కూడా చెప్పింది. ఈ సంస్కరణలను భవిష్యత్‌లో దేశవ్యాప్తంగా అమలుచేస్తామంది. బిహార్‌లో మొత్తం 7.42 కోట్ల మంది ఓటర్లు ఉన్నారని, వీరిలో 14 లక్షల మంది కొత్త ఓటర్లని సీఈసీ చెప్పింది. ఇక నుంచి ఇ÷ఎంఓలపై అభ్యర్థుల కలర్ ఫొటోలు ఉంటాయని ఎన్నికల సంఘం తెలిపింది. ప్రస్తుతం బిహార్‌లో ఎన్డీయే ప్రభుత్వం అధికారంలో ఉంది. 2020లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఏ పార్టీకీ స్పష్టమైన ఆధిక్యం లభించలేదు. దీంతో జేడీయూ, భాజపా కలసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాయి. నీతీశ్ కుమార్ ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు.

# రేవంత్ చీఫ్ మినిస్టర్ కాదు ..కటింగ్ మాస్టర్

(మొదటి తరువాయి)

రేవంత్.. మల్లన్నసాగర్ నుంచి హైదరాబాద్ నగరంకి నీళ్లు ఎలా తీసుకువెళ్తున్నాడని ప్రశ్నించారు. కేసీఆర్ చెమటోడ్చి కట్టిన ప్రాజెక్టు కాళేశ్వరం అని, మల్లన్నసాగర్ ప్రాజెక్టు సీఎం రేవంత్ నాన్న కట్టారని నీళ్లు తీసుకువెళ్తున్నారా? అని మండిపడ్డారు. తలకిందులుగా తపస్సు చేసినా ఇక సీఎం రేవంత్ మాటలను ఇక ప్రజలు నమ్మరు అని హరీష్ రావు అన్నారు. తెలంగాణ బీజేపీ ఎంపీలకు హరీష్ రావు సవాల్ విసిరారు. వడ్లకో నీతి, గోధుమలకో నీతా అని అడిగే దమ్ముందా? బీజేపీ ఎంపీలకు అని అడిగారు. బీజేపీ అంటే తెలంగాణను మోసం చేసిన పార్టీ అని.. బీజేపీది సబ్‌కా సాత్ సబ్‌కా వికాస్ కాదు, పూరా బక్వాస్ అని ఎద్దేవా చేశారు. బీజేపీ అంటే తెలంగాణను మోసం చేసిన పార్టీ అని పేర్కొన్నారు. ప్రాంతీయ పార్టీ బలంగా ఉంటే కేంద్రం మెడలు వంచి పనులు చేసుకోవచ్చు. ఏపీలో టీడీపీ ఇప్పుడు అదే చేస్తుంది. సీఎం రేవంత్ కేరళ, కర్ణాటక, ఢిల్లీ



తిరగడానికి సరిపోతుంది. రాష్ట్రంలో ఆర్ఆర్ టాక్స్ నడుస్తుంది. పోలీసులు మా కార్యకర్తలపై అక్రమ కేసులు పెడితే పింక్ బుక్కులో రాసుకుంటాం. మా ప్రభుత్వం వచ్చాక ఆ పోలీసుల పని పడతాం. కేసీఆర్ వచ్చాకే మార్కెట్ కమిటీల్లో బీసీలకు అవకాశం ఇచ్చాం' అని హరీష్ రావు చెప్పారు. 'సంగారెడ్డి జిల్లాలో లక్షా 20 ఎకరాల సాగు కోసం సంగమేశ్వర బసవేశ్వర ప్రాజెక్టు తెచ్చాడు కేసీఆర్. త్వరలో సంగమేశ్వర బసవేశ్వర ప్రాజెక్టు కోసం పెద్ద ఎత్తున పోరాటం చేస్తాం. కాంగ్రెస్ పోవాలి కేసీఆర్ రావాలి అని జనాలు కోరుకుంటున్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రామిసరి నోట్, బాండ్ పేపర్లకు విలువ లేకుండా చేసింది. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలకు చట్టబద్ధత కల్పిస్తామని హామీ ఇచ్చారు. రేవంత్ రెడ్డి వచ్చాక కొత్త పింఛన్లు ఇవ్వలేదు కానీ 2 లక్షల పింఛన్లు తీసేశారు. రెండు నెలల పింఛన్ ఎగ్గొట్టారు. కాంగ్రెస్ బాకీ కార్డులను ప్రతి గ్రామంలో పంచాలి. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ నాయకులు ఓటు అడగటానికి వస్తే హామీలపై నిలదీయండి. కల్యాణ లక్ష్మి పథకంలో 8 లక్షల తులాల బంగారం కాంగ్రెస్ పార్టీ బాకీ పడింది. నిరుద్యోగ యువతకు 2 లక్షల ఉద్యోగాలు ఇస్తానని చెప్పి 20 వేల ఉద్యోగాలు కూడా ఇవ్వలేదు. రేవంత్ ఎన్నికల ముందు రజిని కాంత్ తర్వాత గజిని కాంత్ లా అయ్యాడు. ఫ్యూచర్ సిటీలో రోడ్లు, మూసి సుందరికరణ కోసం నిధులు ఉంటాయి.

# సుప్రీం కోర్టు తీర్పు శుభపరిణామం

(మొదటి తరువాయి)

పోరాటాలు చేసి సాధిస్తాం.. ఇప్పటికే ప్రభుత్వం 3 చట్టాలు, ఒక ఆర్డినెన్స్ ఒక జీవో ఇచ్చి బీసీ రిజర్వేషన్లు అమలు చేసేందుకు కృషి చేసింది.. ఈ కేసులో తెలంగాణ ప్రభుత్వం తరపున బలమైన వాదనలు వినిపించాం.. 42 శాతం రిజర్వేషన్లపై స్పష్టమైన వైఖరితో ఉన్నాం.. ఈ రిజర్వేషన్ల కోసం జీవో కూడా విడుదల చేశాం.. మా నిర్ణయానికి మేము కట్టుబడి ఉన్నామని తెలిపారు. సుప్రీం తీర్పుపై హర్షం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కల్పనకు తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. సుప్రీంకోర్టులో రాష్ట్ర ప్రభుత్వం తరపున బీసీ రిజర్వేషన్ల కల్పన కోసం అభిషేక్ మనుసింఘ్వి

వాదనలు గట్టిగా వినిపించారన్నారు. అంతకు ముందు మాట్లాడుతూ...బీసీ రిజర్వేషన్ల కల్పనకు సుప్రీంకోర్టు అంగీకరిస్తుందని తమకు నమ్మకం ఉందని చెప్పారు. ఇందిరా సహానీ కేసు తీర్పు ఆధారంగా తెలంగాణలో రిజర్వేషన్లు కల్పించవచ్చన్నారు. సిపెక్ సర్వే ద్వారా సమగ్రమైన జన గణన వివరాల ఆధారంగా రిజర్వేషన్లు కల్పిస్తున్నామని వెల్లడించారు. రిజర్వేషన్ల కల్పన కోసం హైకోర్టు, సుప్రీంకోర్టులో తెలంగాణ ప్రభుత్వం వాదనలు వినిపిస్తుందని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. కాగా.. బీసీ రిజర్వేషన్‌పై సుప్రీం కోర్టులో జరిగే వాదనలు సందర్భంగా తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకాటి శ్రీహరి కోర్టుకు హాజరయ్యారు. సుప్రీం తీర్పును మంత్రి పొన్నం ప్రభాకర్ స్వాగతించారు. తెలంగాణ ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్ల అమలుకు ఇచ్చిన మాట ప్రకారం రాష్ట వ్యాప్తంగా ఇంటికి ఇంటికి సర్వే నిర్వహించామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సోమవారం మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. సబ్ కమిటీ ద్వారా సమీక్షించి క్యాబినెట్ అనుమతి తీసుకొని దాన్ని అసెంబ్లీలో పెట్టి అన్ని రాజకీయాల పార్టీల ఏకగ్రీవ నిర్ణయంతో చట్టాన్ని గవర్నర్‌కు పంపించామని తెలిపారు. గవర్నర్ రాష్ట్రపతికి పంపించారన్నారు. అయితే దీనిపై కొంతమంది వ్యక్తులు కోర్టుకు వెళ్తున్నారని మండిపడ్డారు. రాష్ట హైకోర్టులో వాదనలు జరిగాయని.. ఎన్నికల నోటిఫికేషన్‌కు వెళ్లొచ్చని చెప్పారని మంత్రి వెల్లడించారు. హైకోర్టులో ఈకేసుపై 8వ తేదీ విచారణ జరగాల్సి ఉందని.. ఈ లోపే వారు సుప్రీంకోర్టుకు వచ్చారన్నారు. న్యాయబద్ధంగా సుప్రీంకోర్టులో వాదనలు వినిపించామని స్పష్టం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో ఢిల్లీ వచ్చామని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. సుప్రీంలో కేసు ఉన్నందున ఈ క్రమంలో తెలంగాణ మంత్రులు భట్టి విక్రమార్క , పొన్నం ప్రభాకర్, వాకాటి శ్రీహరి నిన్న రాత్రి ఢిల్లీ చేరుకున్నారు. 42 శాతం బీసీ రిజర్వేషన్లపై సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. తెలంగాణలోని స్థానిక సంస్థల ఎన్నికల్లో 50 శాతానికి మించి రిజర్వేషన్లు అమలు చేయబోతున్నారని పిటిషన్ వేశారు. 50 శాతానికి మించి రిజర్వేషన్లు అమలు చేస్తున్నారంటూ సుప్రీంకోర్టులో వంగ గోపాల్ రెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. గతంలో సుప్రీంకోర్టు 50 శాతం రిజర్వేషన్ మించరాదంటూ ఇచ్చిన తీర్పుకు విరుద్ధమని పిటిషిన్ దాఖలైంది. జస్టిస్ విక్రమ్ నాథ్ ధర్మాసనం ముందు కేసు విచారణకు రాగా పిటిషన్‌ను ధర్మాసనం విచారించేందుకు తిరస్కరించింది. దీంతో మంత్రులు సుప్రీం నిర్ణయాన్ని స్వాగతించారు.

# పరిశ్రమలు పెట్టే వారికి అన్నిరకాల మద్దతు

(మొదటి తరువాయి)

సీఎం అభినందించారు.ఫార్మా పాలసీని ప్రభుత్వం మరింత ముందుకు తీసుకెళ్తుందని చెప్పారు. జీనోమ్ వ్యాలీలో ఏటీసీ సెంటర్ ఏర్పాటు చేస్తున్నామని.. అవసరమైన సాంకేతిక సహకారం అందిస్తామని వెల్లడించారు. ఆనంద్ మహీంద్రా నేతృత్వంలో స్కిల్ యూనివర్శిటీ ఏర్పాటు చేస్తున్నామని.. ఫార్మాకు సంబంధించిన ప్రముఖులు ఆ యూనివర్శిటీ బోర్డు మెంబర్స్‌గా ఉన్నారని సీఎం వివరించారు. తెలంగాణ మరోసారి ప్రపంచం దృష్టిని ఆకర్షించింది. ప్రపంచంలో పేరొందిన ఫార్మా దిగ్గజ కంపెనీ ఎలిలిల్లీ కంపెనీ దేశంలోనే మొదటి సారిగా తమ మాన్యుఫాక్షరింగ్ యూనిట్‌ను హైదరాబాద్‌లో నెలకొల్పనున్నట్లు ప్రకటించింది. ఈ యూనిట్ ఏర్పాటుకు ఒక బిలియన్ డాలర్లు అంటే సుమారు రూ.9000 కోట్లు భారీ పెట్టుబడులకు కంపెనీ ముందుకొచ్చింది. దీంతో ఎలిలిల్లీ కంపెనీ ప్రపంచ వ్యాప్తంగా తమ ఔషధాల సరఫరా సామర్థ్యాన్ని విస్తరించనుంది. సోమవారం ఇంటిగ్రేటేడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఎలిలిల్లీ కంపెనీ ప్రతినిధులు సీఎం రేవంత్ రెడ్డిని కలిశారు. సీఎంతో పాటు ఐటీ అండ్ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు, ఎలిలిల్లీ సంస్థ ప్రెసిడెంట్ ప్యాట్రిక్ జాన్సన్, లిల్లీ ఇండియా ప్రెసిడెంట్ విన్సెలో టుకర్, ప్రత్యేక కార్యదర్శి సంజయ్ కుమార్, సీఎం స్పెషల్ సెక్రెటరీ అజిత్ రెడ్డి ఈ సమావేశంలో పాల్గొన్నారు. చర్చల అనంతరం ఎలిలిల్లీ కంపెనీ తమ విస్తరణ ప్రణాళికలు, తెలంగాణలో భారీ పెట్టుబడులకు సంబంధించి కీలక ప్రకటన చేసింది. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో దేశంలో అధునాతన తయారీ యూనిట్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసే మాన్యుఫాక్షరింగ్, క్వాలిటీ హబ్ తమకు అత్యంత కీలకమైందని కంపెనీ ప్రకటించింది. ఇక్కడి నుంచే దేశంలో ఉన్న ఎలిలిల్లీ కాంట్రాక్ మాన్యుఫాక్షరింగ్ నెట్వర్క్ సాంకేతిక పర్యవేక్షణ, నాణ్యత నియంత్రణ, అధునాతన సాంకేతిక సామర్థ్యాలను అందించనుంది. కొత్త హబ్ ఏర్పాటుతో మన రాష్ట్రంతో పాటు దేశంలో ఫార్మా రంగంలో పని చేస్తున్న వేలాది మంది ప్రతిభావంతులకు ఉద్యోగావకాశాలు లభిస్తాయి. వీలైనంత తొందరలోనే కెమిస్టులు, అనలిటికల్ సైంటిస్టులు, క్వాలిటీ కంట్రోల్, మేనేజ్మెంట్ నిపుణులు, ఇంజనీర్ల నియామకాలు చేపట్టనున్నట్లు కంపెనీ ప్రతినిధులు తెలిపారు. అమెరికాకు చెందిన ఎలిలిల్లీ కంపెనీకి 150 ఏళ్లుగా ప్రపంచ వ్యాపంగా ఔషధాల తయారీ రంగంలో విశేషమైన వైద్య సేవలను అందిస్తుంది. మేక్ ఇన్ ఇండియా లక్ష్యానికి అనుగుణంగా దేశంలో తొలిసారిగా ఏర్పాటు చేస్తున్న ఈ అధునాతన యూనిట్ తెలంగాణను అత్యాధునిక ఆరోగ్య పెట్టుబడుల గమ్యస్థానంగా నిలబెట్టనుంది. ప్రధానంగా డయాబెటిస్, ఓబెసిటీ, ఆల్జీమర్, క్యాన్సర్, ఇమ్యూన్ వ్యాధులకు సంబంధించిన ఔషధాలు, కొత్త ఆవిష్కరణలపై ఈ కంపెనీ పని చేస్తుంది. ఇండియాలో ఇప్పటికే గురుగ్రామ్, బెంగుళూరులో ఎలిలిల్లీ కంపెనీ కార్యకలాపాలు ఉన్నాయి. హైదరాబాద్ లో ఈ ఏడాది ఆగస్ట్ నెలలోనే గ్లోబల్ కెపాబులిటీ సెంటర్‌ను ప్రారంభించింది. విస్తరణలో భాగంగా ఎల్ లిల్లీ కంపెనీ బారీ పెట్టుబడులకు ముందుకు రావటం ఆనందంగా ఉందని, తెలంగాణకు ఇదొక గర్వ కారణమని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.

# అబద్దాలు, మైసాలకు కెరాఫ్ కాంగ్రెస్ పార్టీ..

**-420హామిలిచ్చి అమలు చేయని కాంగ్రెస్ ప్రభుత్వం.**
**-కాంగ్రెస్ పార్టీ బాకి కార్డును ప్రతి గడపకు తీసుకువేళ్తాం...**
**-కాంగ్రెస్ మైసపూరిత పాలనకు విసిగిపోయి కేసీఆర్ పాలనను ప్రజలు కోరుతున్నారన్న మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్.**



అక్షరవేదం /గోదావరిఖని: అక్టోబర్ 06
అబద్దాలకు మైసాలకు కెరాఫ్ కాంగ్రెస్ పార్టీ, అడ్డగోలు హామిలిచ్చి అమలు చేయకుండా ప్రజలను వంచించింది రెవంత్ సర్కారని సోమవారం రామగుండం మాజీ ఎమ్మెల్యే పెద్దపల్లి జిల్లా బి.ఆర్.ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కోరుకంటి చందర్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలు సమయంలో ప్రతేక్షంగా సంతకాలు చేసిన అభయహస్తం కార్డు పేరిట ప్రతి ఇంటికి అందించి నమ్మబలికి ఎన్నికల్లో గెలిచాకా హామిలను అమలు పర్చడం లేదని దినిపై స్దానిక ఎమ్మెల్యే మాక్కాన్ సింగ్, ముఖ్యమంత్రి రెవంత్ రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో దొంగ హామీలు ఇవ్వడ అధికారం లోకి వచ్చాక మర్చిపోవడం కాంగ్రెసుకు పరి పాటిగా మారిందని మండిపడ్డారు. 420 హామీలు, ఆరు గ్యారెంటీలు ఇచ్చి, 100 రోజుల్లో అమలు చేస్తామని చెప్పి 22 నెలలు గడుస్తున్నా వాటి ఊసే ఎత్తడం లేదని దుయ్య బట్టారు. వృద్ధులు, వితంతువులు, బీడీ కార్మి కులు, దివ్యాంగులకు డబుల్ పెన్షన్లు, ఆడబి డ్డల వివాహానికి తులం బంగారం, పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే ఆడ పిల్లలకు సైకిళ్లు, స్కూటీలు, రైతులకు రుణమాఫీ, నిరుద్యోగ యువతకు జాబ్ క్యాలెండర్, విద్యా భరోసా, ఉచిత కరెంట్, గ్యాస్ వంటి పథకాల్లో ఏ ఒక్కటీ సక్రమంగా అమలు చేయలేదన్నారు. ఉద్యమకారులకు 250చదరపు గజాల ఇంటి స్థలం, రూ.5లక్షలు ఇస్తామని నమ్మించి మోసం చేశారన్నారు. రాజీవ్ యువ కిరణాల పేరుతో నాలుగుసార్లు దరఖాస్తులు తీసుకుని, ఇప్పుడు వాటి ఊసే ఎత్తడం లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ మోసాలను ప్రజా ల్లోకి తీసుకెళ్లడానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రె డెంట్ కేటీఆర్ కాంగ్రెస్ పార్టీ బాకీ కార్డు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని, పార్టీ కార్యకర్తలు కర్తలు బాకీ కార్డును గడపగడపకూ తీసుకెళ్లాలని ప్రజలను చైతన్యం చేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ మెసాలను విసిగిపోయిన ప్రజలు తిరిగి కేసీఆర్ పాలన ను కోరుకుంటున్నారని, అన్ని వర్గాల ప్రజలను మైసం చేసిన కాంగ్రెస్ పార్టీ కి రాబోవు ఎన్నికల్లో ప్రజలు బుద్ది చెబుతారన్నారు. అనంతరం డివిజన్ లో ప్రజలకు కాంగ్రెస్ పార్టీ బాకి కార్డులను అందించారు. ఈ కార్యక్రమంలో కౌశిక హరి, మాజీ డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్ రావు, చెలకలపల్లి శ్రీనివాస్, బోడ్డు రవీందర్, బోడ్డుపల్లి శ్రీనివాస్, ఇంజపురి నవీన్, కుమార్, మేతుకు దేవరాజ్, నారాయణదాసు మారుతి, నీరటి శ్రీనివాస్, మేడి సదానందం,దొమ్మేటి వాసు, సట్టు శ్రీనివాస్, బుర్ర వెంకటేష్ ఇరుగురాళ్ల శ్రావణ్, కొడి రామకృష్ణ, సారయ్య నాయక్, కోర్రీ ఓదేలు, ముద్దసాని సంధ్యా రెడ్డి, చింటూ, కనకలక్ష్మి, గుర్రం పద్మ, రామరాజు తదితరులు పాల్గొన్నారు.

# ఖనిలో న్యాయవాదుల నిరసన



అక్షరవేదం/గోదావరిఖని: అక్టోబర్ 06
గోదావరిఖనికి చెందిన న్యాయవాది గుళ్ళ రమేష్ పై కొంతమంది దాడి చేయటాన్నీ నిరసిస్తూ సోమవారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు కోర్టు ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం న్యాయవాదులు కోర్టు నుంచి ఖని ప్రధాన చౌరస్తా వరకు నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు న్యాయవాదులు మాట్లాడుతూ.. నిత్యం న్యాయం కోసం పరితపించే న్యాయవాదులపై పోలీస్ స్టేషన్ కు కూతవేటు దూరంలో బీరు సీసాలతో దాడి చేయడం దారుణమన్నారు. న్యాయవాదులపై దాడులకు పాల్పడ్డ నిందితులను వెంటనే అరెస్టు చేయాలని వారు డిమాండ్ చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి న్యాయవాదుల రక్షణ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు తౌటం సతీష్, సంయుక్త కార్యదర్శి ముచ్చకుర్తి కుమార్, క్రీడా, సాంస్కృతిక కార్యదర్శి ఎరుకల ప్రదీప్ కుమార్, ఉపాధ్యక్షులు దేశెట్టి అంజయ్య, సభ్యులు పంగ శంకర్, పులిపాక రాజ్ కుమార్, సీనియర్ న్యాయవాదులు బల్మూరి అమరేందర్ రావు, మేడ చక్రపాణి, చందాల శైలజ, పెట్టం శ్రీనివాస్, గోశిక ప్రకాష్, కోసన శ్రీనివాస్, వేల్పుల అరుణ్ కుమార్ యాదవ్, అవినాష్, వెంకటేష్, సుజాత, రేష్మ, తిలక్ తదితరులు పాల్గొన్నారు.

# కార్మికుల హక్కుల సాధన ఏఐటియుసి తోనే సాధ్యం: మడ్డి ఎల్లాగౌడ్



అక్షరవేదం/గోదావరిఖని: అక్టోబర్ 06
సింగరేణి లో చరిత్ర కలిగిన యూనియన్ ఏఐటియుసి అని, యూనియన్ బలోపేతానికి మెంబర్ షిప్ ను అధిక సంఖ్యలో చేయాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్ కార్మికులను కోరారు. సోమవారం సింగరేణి ఆర్జీ వన్ ఏరియా లోని జిడికె వన్ ఇంక్లైన్ లో ఏఐటియుసి యూనియన్ కు మెంబర్ షిప్ ను చేసేందుకు ఆయన కార్మికుల తో ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... సింగరేణి లో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి కార్మికుల హక్కుల సాధన కోసం, సంస్థ పరిరక్షణ కోసం గత ఎనిమిది దశాబ్దాలుగా అనేక మంది యూనియన్ నాయకులు తమ ప్రాణాలను లెక్కచేయకుండా అనేక పోరాటాలు చేసి కార్మికులకు హక్కులు సాధించి పెట్టడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. ఎలాంటి అధికారిక పదవులు లేకున్నా, ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్న కార్మికుల అండతో పోరాటాలు, సమ్మె లు చేసి హక్కులు సాధించిన చరిత్ర ఏఐటియుసి కి ఉందని ఆయన తెలిపారు. సింగరేణి లో ఏఐటియుసి గుర్తింపు సంఘంగా ఏడవ సారి గెలిచిన తరువాత కార్మికుల కు ఇచ్చిన హామీలను అమలు చేయడం కోసం యాజమాన్యం తో నిరంతరం చర్చలు జరిపి పరిష్కారం కోసం కృషి చేయడం జరుగుతుందని ఆయన అన్నారు. గత ఎనిమిది దశాబ్దాలుగా కార్మిక వర్గం ఇచ్చిన సభ్యత్వం తో యూనియన్ ను బలోపేతం చేయడం జరుగుతుందని, కనుక కార్మిక వర్గం ఏఐటియుసి కి అధిక సంఖ్యలో మెంబర్ షిప్ చేసేందుకు ముందుకు రావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి పిట్ సెక్రటరీ మానాల శ్రీనివాస్, నాయకులు కలవేణి రాజేష్, కొరిమి శ్రావణ్ కుమార్, సమ్మయ్య, నగేష్, వెంకటేష్, ఎర్రగొల్ల చేరాలు, ఆఫీస్ కార్యదర్శి తొడుపునూరి రమేశ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# పలు కుటుంబాలకు ఆర్థిక సాయంతో పాటు నిత్యవసర సరుకులు అందజేత

**- సుందరం ఫౌండర్ మాజీ ఎంపిటిసి బోనాల వెంకటస్వామి**





అక్షర వేదం ప్రతినిధి.కమాన్ పూర్ అక్టోబర్0 6
కమాన్ పూర్ మండలం పేరపల్లి గ్రామంలోని పేద కుటుంబానికి చెందిన దూలం సంపత్ గౌడ్, గీతా కార్మికుడు ఇటీవల ఈత చెట్టు పై నుంచి పడిపోవడం వల్ల కుడికాలు విరిగిన విషయం పలు న్యూస్ పేపర్ల ద్వారా తెల్సుకున్న సుందరం ఫౌండేషన్ ఫౌండర్ బోనాల వెంకటస్వామి ఆదేశాల మేరకు హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న సంపత్ ను పరామర్శించి Rs.3000/- రూపాయల ఆర్థిక సహాయం ఫౌండేషన్ సభ్యులు అందజేశారు. -అలాగే నాగారం గ్రామానికి చెందిన అగ్గిమల్ల శ్రీనివాస్ దశదిన ఖర్మ ఈరోజు జరుగనున్న కారణంగా వాళ్ళ కుటుంబ సభ్యులకు 25 కిలోలబియ్యం సుందరం ఫౌండేషన్ సహకారంతో అందజేశారు. గతంలో అంత్యక్రియల నిమిత్తం Rs.2000/- ఫౌండేషన్ సభ్యులు అందజేయడం జరిగింది. బాపూజీ నగర్లో నివసిస్తున్న కోటగిరి లక్ష్మయ్య ఇటీవల అనారోగ్యం కారణంగా మరణించడంతో బాధిత కుటుంబానికి 25 కిలోల బియ్యం మరియు నిత్యవసర సరుకులు సుందరం ఫౌండేషన్ సహకారంతో ఈరోజు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సుందరం ఫౌండేషన్ ప్రెసిడెంట్ బోనాల మల్లయ్య, వైస్ ప్రెసిడెంట్ కన్నూరి నగేష్, సెక్రటరీ చిప్పకుర్తి అరవింద్ సభ్యులు చెన్నోజు చంద్రశేఖర్, దండె తిరుపతి, కుక్క ప్రసాద్, పొన్నం శ్రీరాములు గౌడ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సహకారం అందించిన సుందరం ఫౌండేషన్ ఫౌండర్, మాజీ ఎంపీటీసీ బోనాల వెంకటస్వామికి అలాగే సాయం అందిస్తున్న ఫౌండేషన్ సభ్యులకు పలు బాధితుల కుటుంబ సభ్యులు హృదయ పూర్వక ధన్యవాదాలు తెలియజేసారు.

# విశ్వబ్రాహ్మణ విద్యార్థులు ఆదర్శంగా నిలవాలి...





**- ప్రతిభ పురస్కార్ అవార్డులు అందజేసిన వాపా**

అక్షరవేదం/గోదావరిఖని: అక్టోబర్ 06
వాపా రామగుండం నియోజకవర్గం ఆధ్వర్యంలో 2024 - 25 విద్యా సంవత్సరములో 10వ తరగతి, ఇంటర్మీడియట్ లో ప్రతిభ కనపరిచిన 21మంది విశ్వ బ్రాహ్మణ విద్యార్థిని, విద్యార్థులకు ప్రతిభ పురస్కారం, నగదు బహుమతితోపాటు జ్ఞాపిక అందజేశారు. గోదావరిఖని మార్కండేయ కాలనీలో ఆదివారం రామగుండం నియోజకవర్గం వాపా అధ్యక్షులు నాగులమల్యాల రాజమౌళి చార్యులు అధ్యక్షతన వహించగా ముఖ్య అతిథులుగా వాపా రాష్ట్ర కన్వీనర్ వేములవాడ ద్రోణచారి, వాపా రాష్ట్ర కో కన్వీనర్ కట్ట విష్ణువర్ధన్ హాజరై విద్యార్థినీ విద్యార్థులకు ప్రతిభ పురస్కార్, నగదు తో పాటు జ్ఞాపిక ప్రశంసా పత్రాలు అందజేసి శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ... సమాజంలో విద్యతో పాటు విశ్వబ్రాహ్మణ విద్యార్థిని, విద్యార్థులు ఉన్నత స్థానాలు అధిరోహించి ఆదర్శంగా నిలవాలని సూచించారు. మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా తల్లిదండ్రుల సూచనలు పెడచెవిన పెట్టకుండా భవిష్యత్తులో మంచి మార్గాన్ని ఎంచుకొని సంస్కృతి సంప్రదాయాలు పాటించి విశ్వబ్రాహ్మణ విద్యార్థులుగా అందరికీ ఆదర్శంగా నిలువాలని కోరారు. ఈ కార్యక్రమంలో రామగుండం వాపా ప్రధానకార్యదర్శి పానుగంటి స్వామి, పెద్దపల్లి జిల్లా స్వర్ణ కార సంఘం అధ్యక్షులు రంగు శ్రీనివాస్, వాపా మంథని నియోజకవర్గం ప్రధానకార్యదర్శి మూలుకళ్ల రజశేఖర్, పురోహితబ్రహ్మ ముత్తోజు వీరబ్రహ్మాచార్యులు, ఏలేశ్వరం వెంకటేశ్వర్లు, రామగుండం వాపా కోశాధికారి పానుగంటి మారుతి, ఉపాధ్యక్షులు కత్రోజు మోహనబాబు, కె రమణబాబు, సలహాదారులు పూసాల సదానందచారి, కాసార్ల ఆనంద్, మంచోజు స్రవంతి, మనంచోజు బ్రహ్మాచారి సంయుక్త కార్యదర్శి లు పొడిశెట్టి శంకరచారీ, బసవత్తుల రామయ్య, ఉట్నూరి రాజయ్య, మడుపోజు రవీంద్రచారీ, కార్యవర్గ సభ్యులు పానుగంటి రామస్వామి, పానుగంటి వెంకటేశ్వలు, వాపా సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విశ్వ బ్రాహ్మణ బంధువులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# బుద్ధ నగర్ లో ఉచిత కంటి వైద్య శిబిరం

**విజయ నేత్రాలయం ఆస్పత్రి సౌజన్యంతో శంషాబాద్ సాయి రామ్ రెడ్డి జన్మదిన పుష్కరించుకుని వైద్య శిబిరం.**






అక్షర వేదం/మేడ్చల్ మల్కాజ్గిరి /మేడిపల్లి: పిర్జాదిగూడ,అక్టోబర్ 06,
మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా పిర్జాదిగూడ బుద్ధ నగర్ లో ఎస్ ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఫౌండేషన్ వ్యవస్థాపకుడు శంషాబాద్ సాయిరాం రెడ్డి జన్మదిన పురస్కరించుకొని విజయ నేత్రాలయం ఆస్పత్రి వారి సౌజన్యంతో ఈ ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరానికి హాజరైన వారికి పలు రకాల కంటి పరీక్షలను నిర్వహించి మందులను కంటి అద్దాలను పంపిణీ చేశారు. ప్రతి ఏటా తన పుట్టినరోజు సందర్భంగా అనేక రకాల సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని ఈ సంవత్సరం కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించామని సాయిరాం రెడ్డి తెలిపారు. కంటి సమస్య తీవ్రంగా ఉన్నవారికి ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయడానికి సైతం సిద్ధంగా ఉన్నానని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఈ శిబిరంలో విజయ నేత్రాలయ వైద్యులు సుష్మారెడ్డి మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ వైద్య శిబిరం నిర్వహించడం పట్ల కాలనీవాసులు సంతోషం వ్యక్తపరిచారు.

# నాగిరెడ్డి పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించిన

**- డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి**



అక్షర వేదం /వనపర్తి :
వనపర్తి మండలం సవాయి గూడెం గ్రామ మాజీ సర్పంచ్ సాని నాగిరెడ్డి మరణ వార్త కాంగ్రెస్ పార్టీ నాయకుల ద్వారా తెలుసుకున్న రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి నాగిరెడ్డిపార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సవాయిగూడెం గ్రామానికి 18 సంవత్సరాలు సర్పంచిగా నియామకమై గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేశారని తెలిపారు. నాగిరెడ్డి మరణం కాంగ్రెస్ పార్టీ కి తీరని లోటు అని తెలిపారు. నాగిరెడ్డి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్త పరిచారు. . నాగిరెడ్డి లేని బాధ నుంచి కోలుకొని ధైర్యంగా ఉండాలని కుటుంబ సభ్యులకు మనో ధైర్యం చెప్పారు.నివాళులర్పించిన వాళ్ళు వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధానకార్యదర్శి చీర్ల జనార్ధన్, వనపర్తి మండల్ ఎన్. ఎస్ యు ఐ అధ్యక్షుడు ఎత్తం చరణ్ రాజ్ , సీనియర్ నాయకులు హరిబాబు రెడ్డి, ధర్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు .

## మంథని మున్సిపాలిటీ నూతన కమీషనర్ గా మనోహర్ బాధ్యతలు స్వీకరణ



**అక్షర వేదం/మంథని,అక్టోబర్ 6:** మంథని మున్సిపాలిటీ నూతన కమీషనర్ గా మనోహర్ రెడ్డి సోమవారం రోజున బాధ్యతలు స్వీకరించారు.మంథని మున్సిపాలిటీలో కమీషనర్ గా పనిచేసిన సీహెచ్ వెంకన్న జిహెచ్ఎంసికి బదిలీ పై వెళ్లడంతో,మూడు నెలల క్రితం బదిలీపై వెళ్లిన మనోహర్ రెడ్డి తిరిగి మంథని మున్సిపాలిటీ కమీషనర్ గా బాధ్యతలు స్వీకరించారు..


## ప్రజలకు రుణపడిన ఆరు గ్యారంటీలు అమలుపై కాంగ్రెస్ ను నిలదీసి ఎన్నికల్లో గులాబీ సత్తా చాటాలి

-గడపగడపకు"కాంగ్రెస్ బాకీ కార్డు" అందజేస్తున్న బిఆర్ఎస్ నాయకులు



**అక్షర వేదం ప్రతినిధి:కమాన్ పూర్ అక్టోబర్ 06:** కమాన్ పూర్ మండలం లోని గొల్లపల్లి, పెరపల్లి, రొంపికుంట, నాగారం గ్రామాల్లో మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ఆదేశాల మేరకు సోమవారం కాంగ్రెస్ బాకీ కార్డులు కమాన్ పూర్ మండల బిఆర్ఎస్ పార్టీ మండలశాఖ ఆధ్వర్యంలో గడపగడపకు పంపిణి చేసారు.అనంతరం బిఆర్ఎస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ నాయకులు వస్తే అసెంబ్లీ ఎన్నికల్లో ఆరు గ్యారెంటీలు హామీలు ఇచ్చి గద్దెనెక్కిన తరువాత అమలు ఎందుకు చెయ్యలేదని కాంగ్రెస్ నాయకులను నిలదీయాలని అన్నారు. ఎన్నికలకు ముందు ఆరు గ్యారంటీలు, 420 హామీలని ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత తెలంగాణ ప్రజానీకాన్ని మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని "కాంగ్రెస్ బాకీ కార్డు"తో ఇంటింటికీ ప్రచారం చేసి ప్రజలకు గుర్తు చేస్తున్నామని,రాబోయే స్థానిక ఎన్నికల్లో గులాబీ సత్తా చాటుతామని అన్నారు. ప్రజలు కేసీఆర్ రావాలని కోరుకుంటున్నారని అన్నారు.ఈ కార్యక్రమంలో కమాన్ పూర్ మండల బిఆర్ఎస్ పార్టీ మాజీ ప్రజాప్రతినిధులు, మండల నాయకులు, కార్యకర్తలు పలువురు పాల్గొన్నారు.

## ప్రమాదకరంగా ఉన్న గుంతను పూడ్చిన ట్రాఫిక్ పోలీస్ అనిల్



**అక్షర వేదం ప్రతినిధి:పెద్దపల్లి అక్టోబర్ 06:** ప్రమాదకరంగా ఉన్న ప్రధాన రహదారిపై గుంతను పూడ్చి మానవత్వం చాటుకున్న మహనీయుడు ట్రాఫిక్ కానిస్టేబుల్ సిరికొండ అనిల్. పెద్దపల్లి - మంథని ప్రధాన రహదారి పెద్దపల్లి ఫ్లై ఓవర్ వంతెన సమీపంలో రహదారి పై ఏర్పడిన లోతైన గుంత వాహనదారులకు ప్రమాదకరంగా మారడంతో మండుటెండలో గుంతను పూడ్చి మానవత్వం చాటుకున్నాడు, రహదారి వెంట వెళ్లే వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దానిని పూడ్చడంతో , వాహనదారులు పలువురు కానిస్టేబుల్ ను ప్రశంసించారు.

## నామినేషన్ స్వీకరణ కేంద్రాలను పరిశీలించిన ఎంపీడీవో, ఎంపీవో



**అక్షర వేదం, జైపూర్, అక్టోబర్ 6** మంచిర్యాల జిల్లా జైపూర్ మండలంలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ దృష్ట్యా తేది:-06/10/2025 రోజున గ జైపూర్ ఎంపిడిఓ జి.సత్యనారాయణ జైపూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హై స్కూల్ ( జెడ్ పి హెచ్ ఎస్) నందు ఏర్పాటు చేయనున్న నామినేషన్ స్వీకరణ కేంద్రాలు, రిసెప్షన్ సెంటర్, డిస్ట్రిబ్యూషన్ సెంటర్స్ గ్రామ పంచాయతీ ఎన్నికల మెటీరియల్ లని పరిశీలించడం జరిగింది. జైపూర్ మండల్ ఎంపీడీవో తో పాటు, జైపూర్ మండల్ ఎంపీ ఓ శ్రీపతి బాపు రావు, భాగ్యలక్ష్మి, కార్యాలయ సూపరింటెండెంట్ , మధులత సీనియర్ అసిస్టెంట్, బి. ఉదయ్ కుమార్ పంచాయతీ కార్యదర్శి జైపూర్, టి. మల్లేష్ జూనియర్ అసిస్టెంట్, సిబ్బంది ఉన్నారు.

# ఓట్ల చోరీ ప్రజాస్వామ్యానికి ప్రమాదకరం

-దేశంతో ప్రతి చోట ఓటు చోరీ చేసింది బిజెపి

-డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి




**అక్షర వేదం/ వనపర్తి :** ఓటు చోరీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో ప్రతి గ్రామంలో 100 మందితో సంతకాల సేకరణ చేపట్టాలని ఏఐసీసీ ఆదేశించింది. వనపర్తి జిల్లాలోసంతకాల సేకరణలో భాగంగా గోపాల్ పేట్ మండలం జయన్న తిరుమలాపురం గ్రామంలో వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ యాదవ్ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొనడం జరిగింది.

చిన్నారెడ్డి మాట్లాడుతూ దేశంలో బిజెపి పార్టీ పెద్ద ఎత్తున ఓటు చోరీ చేసి కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిందని అన్నారు.త్వరలో ఎన్నికలు జరిగే బీహార్ రాష్ట్రంలో బిజెపి పార్టీ పెద్ద ఎత్తున ఓటు చోరీ చేసిందని లోక్ సభ ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ ఆధారాలతో చూపించారు అని అన్నారు.ఎన్నికల సంఘం కానీ బిజెపి పార్టీ కానీ రాహుల్ గాంధీ వారు చెప్పిన వాస్తవాలు తప్పు అని చెప్పాలేక పోయరు అని తెలిపారు.తెలంగాణ రాష్ట్రంలో 2018 ఎన్నికలలో ఈవీఎం ట్యాంపరింగ్ జరిగిందని , దక్షిణ తెలంగాణ ప్రాంతంలో కాంగ్రెస్ పార్టీ బలంగా ఉన్నా కూడా ఒకే ఒక్క సీటు గెలవడమే ఈవీఎం ట్యాంపరింగ్ కు సూచిక అని అన్నారు.ప్రజాస్వామ్యంలో వ్యక్తి తన యొక్క సొంత అభిప్రాయాన్ని కూడా దొంగలించడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని అన్నారు.బీహార్ రాష్ట్రంలో రాహుల్ గాంధీ ఓట్ అధికార యాత్ర చేపట్టి ప్రజలను చైతన్య పరచడంతో ఎన్నికల సంఘం కొత్త ఓటర్ లిస్ట్ ను ప్రకటించిందని అది రాహుల్ గాంధీ విజయమని అన్నారు.చిన్నారెడ్డి గ్రామంలో కార్యకర్తలతో కలిసి100 సంతకాల సేకరణ చేశారు.ప్రసాద్ యాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఓటు చోరీ కి వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా సంతకాల సేకరణకు శ్రీకారం చుట్టిందని దానిలో భాగంగా జిల్లాలో జయన్న తిరుమలపురంలో సంతకాల సేకరణ చేపడుతున్నామని తెలిపారు.జిల్లా వ్యాప్తంగా సంతకాల సేకరణ చేపట్టి వాటి అన్నిటిని 15 తేదీన పిసిసికి పంపవలసి ఉంటుందని ఇట్టి కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొని విజయవంతం చేయవలసిందిగా తెలియజేశారు. కార్యక్రమంలో వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ యాదవ్, జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి చీర్ల జనార్ధన్, వనపర్తి జిల్లా ఎన్ ఎస్ యు ఐ అధ్యక్షుడు రోహిత్, వనపర్తి యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ వైస్ ప్రెసిడెంట్ రాగి అక్షయ్, తాడిపర్తి గ్రామ మాజీ సర్పంచ్ జోగు తదితరులు పాల్గొన్నారు.

# కోల్డ్ రిఫ్ సిరప్ వినియోగం వెంటనే నిలిపివేయండి

జిల్లా వైద్య-ఆరోగ్యశాఖ అధికారి డా.అనిత



**అక్షర వేదం, మంచిర్యాల్,అక్టోబర్ 6** మంచిర్యాల జిల్లాలో చిన్నపిల్లలలో దగ్గును నియంత్రించేందుకు వినియోగించే కోల్డ్ రిఫ్ సిరప్ వాడకాన్ని వెంటనే నిలిపివేయాలని జిల్లా వైద్య-ఆరోగ్యశాఖ అధికారి డా? అనిత ఒక ప్రకటనలో తెలిపారు. డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ (డి.జి. హెచ్.ఎస్.), తెలంగాణ రాష్ట్ర వైద్య-ఆరోగ్యశాఖ డైరెక్టర్ మార్గదర్శకాల ప్రకారం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలో కోల్డ్ రిఫ్ సిరప్ వినియోగించడం వెంటనే ఆపాలని, సిరప్ సంబంధిత నిల్వలు జిల్లాలో అందుబాటులో లేవని, జిల్లాలోని ప్రైవేట్ ఆసుపత్రులు, ఫార్మాసిస్టులు, ఏజెన్సీలు తమ వద్ద సిరప్ నిల్వలు ఉన్నట్లయితే వెంటే సమాచారం అందించాలని తెలిపారు. తమిళనాడులోని కాంచీపురం జిల్లాకు చెందిన శ్రేసన్ ఫార్మా మే 2025 నెలలో తయారు చేసిన బ్యాచ్ నం.ఎస్ఆర్-13 నుండి వచ్చిన కోల్డ్ రిఫ్ సిరప్ వినియోగించడం వలన చిన్న పిల్లలలో అనారోగ్య సమస్యలు రావడంతో ఈ మందు నిషేధించడం జరిగిందని, మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాలలో అనేక మంది పిల్లల మరణానికి కోల్డ్ రిఫ్ సిరప్ వినియోగంతో సంబంధం ఉండటంతో ఈ చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ ప్రకారం నమోదు చేసుకున్న అన్ని ఆసుపత్రులు, ఫార్మసీ కేంద్రాలు, చిన్నపిల్లల వైద్యులు, ప్రైవేట్ వైద్యుల వద్ద కోల్డ్ రిఫ్ సిరప్ లు ఉండరాదని, సిరప్ నిల్వలు కలిగి ఉన్న వారు జిల్లా వైద్య-ఆరోగ్యశాఖ కార్యాలయంలో / టోల్ ఫ్రీ నం. 1800 599 6969 లో వివరాలు అందించాలని తెలిపారు. జిల్లాలోని ప్రభావిత బ్యాచ్ సిరప్ నిల్వలను గుర్తించి, నిలిపివేయడానికి ఫార్మసీలు, హోల్ సేల్ వ్యాపారులు, ఆసుపత్రులను అప్రమత్తం చేయడం జరిగిందని తెలిపారు. జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు తమ పరిధిలోని గ్రామాలలో ఉన్న ఫార్మసీల వద్ద ఉన్న సిరప్ ల వివరాలు తీసుకోవాలని తెలిపారు. 2 సం౹౹ల వయస్సు లోపు గల పిల్లలకు ఎలాంటి దగ్గు మందుల వినియోగానికి వైద్యులు సూచించరాదని, తల్లిదండ్రులు పిల్లల వైద్య నిపుణుల సూచన ద్వారా మాత్రమే మందులను వినియోగించాలని, ఫార్మాసిస్టులు / డ్రగ్గిస్ట్ లు వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు విక్రయించరాదని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

# ఎంబిబిఎస్ సీటు సాధించిన విద్యార్థినికి సింగరేణి మెరిట్ స్కాలర్ షిప్




**అక్షర వేదం, జైపూర్, అక్టోబర్ 6** మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం ఎస్టిపిపి లోని పరిపాలన భవనంలో గల సమావేశ మందిరంలో జరిగిన ఒక కార్యక్రమంలో ఎంబిబిఎస్ సీటు సాధించిన విద్యార్థిని ఎర్రోజు జాహ్నవి కి సింగరేణి మెరిట్ స్కాలర్ షిప్ అందచేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఈడి ఎస్టిపిపి సిహెచ్ చిరంజీవి పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా ఈడి ఎస్టిపిపి సిహెచ్ చిరంజీవి మాట్లాడుతూ సింగరేణి సంస్థ సంక్షేమ కార్యక్రమాలలో భాగంగా ఇంజనీరింగ్,మెడికల్ ప్రవేశ పరీక్ష (ఎంసెట్/నీట్/జె ఈ ఈ) లలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సింగరేణి ఉద్యోగుల పిల్లలకు ప్రతి ఏటా మెరిట్ స్కాలర్షిప్ అందజేయడం జరుగుతుందన్నారు. అందులో భాగంగా మన ఎస్టిపిపి నుండి ఎర్రోజు జాహ్నవి మెడికల్ ప్రవేశ పరీక్షలో మంచి ర్యాంకు సాధించి రామగుండము లోని సింగరేణి మెడికల్ కాలేజీలో సీటు సాధించారని తెలిపారు. వారి తండ్రి ఎర్రోజు రాజకుమార చారి విజిలెన్స్ డిపార్టుమెంటులో సీనియర్ సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినికి,వారి తల్లిదండ్రులకు శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది.అనంతరం ఈడి ఎస్టిపిపి సిహెచ్ చిరంజీవి చేతుల మీదుగా మెరిట్ స్కాలర్ షిప్ చెక్కును జాహ్నవికి అందజేయడం జరిగింది. తదనంతరం ఎస్టిపిపి అధికారులు ఉద్యోగులు మెడికల్ సీటు సాధించిన విద్యార్థిని ఎర్రోజు జాహ్నవికి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిఎం ఎస్టిపిపి ఎం నరసింహరావు, ఏఐటియుసి పిట్ సెక్రటరీ సిహెచ్ సత్యనారాయణ, సిఎంఓఏఐ బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ పి అప్పారావు, ఏజీఎం (పిసిఎస్) మదన్మోహన్, ఏజీఎం ఫైనాన్స్ మురళీధర్, డీజీఎం(పర్సనల్) డి కిరణ్ బాబు , వివిజిలెన్స్ డిపార్టుమెంటు విభాగాదిపతి రామబ్రహ్మం ఇతర అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# బోడుప్పల్లో ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభోత్సవం

**ప్రారంభించిన మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జీ తోటకూర వజ్రేష్ యాదవ్**

**బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శైలజ**





**అక్షర వేదం/మేడ్చల్ మల్కాజ్గిరి/మేడిపల్లి బోడుప్పల్,అక్టోబర్ 06** మేడ్చల్ నియోజకవర్గంలోని బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 18వ వార్డులో నిర్మితమైన ఇందిరమ్మ ఇల్లు గృహ ప్రవేశ పూజా కార్యక్రమంలో మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జీ తోటకూర వజ్రేష్ యాదవ్, మాజీ మేయర్ తోటకూర అజయ యాదవ్, బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శైలజ, మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు పోగుల నర్సింహా రెడ్డి,18 వ వార్డ్ మాజీ కార్పొరేటర్ పులకండ్ల హేమలత జంగారెడ్డి,స్థానిక మాజీ ప్రజా ప్రతినిధులు,కాంగ్రెస్ నాయకులతో కలిసి లబ్ధిదారుల ఇందిరమ్మ ఇండ్లును ప్రారంభించి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఈ ఇళ్లను అందించిందని తెలిపారు. ప్రభుత్వ ప్రతిష్టాత్మకమైన ఇందిరమ్మ ఇల్లు పథకం ద్వారా లక్షలాది మంది పేద కుటుంబాలకు లబ్ధి కలిగిందని చెప్పారు.లబ్ధిదారులు మాట్లాడుతూ రూ 5 లక్షలతో తమకు సొంతిల్లు కలగజేసినందుకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు రాపోలు రాములు,మేడ్చల్ నియోజకవర్గం బి బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్,మాజీ కార్పొరేటర్లు బొమ్మకు కళ్యాణ్, చీరాల నరసింహ,సింగిరెడ్డి పద్మా రెడ్డి,హరినాథ్ రెడ్డి,గుర్రాల వెంకటేష్ యాదవ్, విజయపురి కాలనీ అధ్యక్షుడు నర్సింగ్ యాదవ్, నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# గోవా గార్డియన్స్ పై కొచ్చి బ్లూ స్పైకర్స్ విజయం

**-ఉత్కంఠ భరితంగా ప్రైమ్ వాలీబాల్ లీగ్ నాలుగో సీజన్**




**హైదరాబాద్, అక్టోబర్ 06 (అక్షర వేదం) :** ఆర్ఆర్ కేబుల్స్ ప్రైమ్ వాలీబాల్ లీగ్(పీవీఎల్) నాలుగో సీజన్‌లో కొచ్చి బ్లూ స్పైకర్స్ అద్భుత విజయాన్ని అందుకుంది. హైదరాబాద్‌లోని గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో ఆదివారం రాత్రి జరిగిన ఐదు సెట్ల పాటు నువ్వానేనా అన్నట్లు సాగిన థ్రిల్లర్‌లో కొచ్చి జట్టు 3-2(11-15, 17-15, 15-13, 10-15, 15-10) తేడాతో గోవా గార్డియన్స్‌పై గెలుపొందింది. కొచ్చి ఆటగాడు హేమంత్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు. మ్యాచ్ ఆరంభంలోనే గోవా కెప్టెన్ చిరాగ్ యాదవ్ సూపర్ సర్వ్‌తో తన జట్టుకు శుభారంభం అందించాడు. అయితే కొచ్చి కెప్టెన్ ఎరిన్ తన అద్భుతమైన ఎటాకింగ్‌తో దీటుగా బదులిచ్చాడు. గోవా తీసుకున్న సూపర్ పాయింట్ ఎరిన్ సర్వీస్ తప్పిదంతో వారికి ఫలించింది. ఆ తర్వాత కొచ్చి ఆటగాళ్లు అమరీందర్ పాల్ సింగ్, హేమంత్ తమ పవర్‌ఫుల్ సర్వ్‌లు, ఎటాకింగ్‌తో జట్టును పోటీలోకి తెచ్చారు. ముఖ్యంగా చిరాగ్ స్పైక్స్‌ను అడ్డుకోవడానికి కొచ్చి కెప్టెన్ బైరన్ కెటురాకిస్ చేపట్టిన 'టూ-మ్యాన్ బ్లాక్' వ్యూహం అద్భుతంగా పనిచేసింది. ఈ క్రమంలో ఊపందుకున్న కొచ్చి, గోవా ప్లేయర్ల ప్రిన్స్ సర్వీస్‌లో చేసిన పొరపాటుతో లభించిన సూపర్ పాయింట్‌ను సద్వినియోగం చేసుకొని ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. మ్యాచ్‌లో 1-2తో గోవా గార్డియన్స్ ఏమాత్రం పట్టు వదల్లేదు, రోహిత్ తన సర్వీసులతో ప్రత్యర్థిని పరీక్షించగా సబ్‌స్టిట్యూట్‌గా వచ్చిన విక్రమ్ ఎటాకింగ్, డిఫెన్స్‌లో రాణించి జట్టుకు అండగా నిలిచాడు. దీంతో గోవా నాలుగో సెట్‌ను గెలుచుకుని మ్యాచ్‌ను నిర్ణయాత్మక ఐదో సెట్‌కు తీసుకెళ్లింది. ఆఖరి సెట్‌లో ఇరు జట్లు పాయింట్ల కోసం తీవ్రంగా పోరాడాయి. ఈ దశలో కొచ్చి లిబరో అలాన్ ఆషిక్ అద్భుతమైన సేవలు చేసి కీలక పాయింట్లను అందించాడు. ఫ్రంట్ కోర్ట్‌లో హేమంత్ ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు. చివరగా ఎరిన్ కోసం కొచ్చి తీసుకున్న ఒక స్మార్ట్ రివ్యూ ఫలించి కీలకమైన సూపర్ పాయింట్ లభించడంతో కొచ్చి బ్లూ స్పైకర్స్ 3-2 తేడాతోవిజయాన్ని అందుకుంది.

# మట్టిలో మాణిక్యం డాక్టర్ దాసరి అజయ్ కుమార్ యాదవ్

**-పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన ఉస్మానియా యూనివర్సిటీ అంజి యాదవ్**




**హైదరాబాద్, అక్టోబర్ 06 (అక్షర వేదం) :** మహబూబ్ నగర్ మట్టి పరిమళంలో నుంచి వికసించిన మహోన్నతమైన వ్యక్తి డాక్టర్ దాసరి అజయ్ కుమార్ యాదవ్ అని ఉస్మానియా యూనివర్సిటీ అంజి యాదవ్ అన్నారు. అజయ్ కుమార్ యాదవ్ జన్మదినం సందర్భంగా మారుమూల పల్లెలో పుట్టి అంతర్జాతీయ స్థాయిలో 40 సంవత్సరాల క్రితమే వ్యవసాయ రంగంపై ప్రతిభను కనబరిచి రష్యా దేశం నుంచి గౌరవ డాక్టరేట్ పట్టా పొందిన మేధావి అన్నారు. ప్రపంచంలో అనేక దేశాలు ఉన్నతమైన అవకాశాలు కల్పిస్తామని ముందుకు వచ్చిన వదులుకొని జన్మనిచ్చిన మాతృభూమి సేవకై తాను పొందిన జ్ఞానాన్ని అందించుటకు సిద్ధమై వ్యవసాయ అధికారిగా వృత్తిని చేపట్టి ఈ దేశంలో మొట్ట మొదటిసారిగా చెంచులకు వ్యవసాయాన్ని నేర్పించి అనేక రాష్ట్రాల్లో తన సేవలను అందించి తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలకంగా పనిచేసి ఒక వైపు వృత్తిని మరోవైపు సామాజిక ఉద్యమ నాయకులుగా బీసీ జనచైతన్య వేదిక, మాస్(మండల్ ఆశయ సాధన సమితి), అఖిల భారత యాదవ సేవా సంఘం, నిరంతరం పదవిలో ఉన్నప్పుడైనా పదవీ విరమణ పొందిన తర్వాత అయినా అనేక సామాజిక సంస్థల వ్యవస్థాపక అధ్యక్షులుగా ప్రజా పార్టీ రాష్ట్ర అధ్యక్షులుగా, సామాజిక తెలంగాణ పొలిటికల్ ఫ్రంట్(ఎస్.టీ.పీ.ఎఫ్) చైర్మన్ గా దోపిడి వర్గాల కుట్రలలో బందీ అయిన బహుజనులను చైతన్యం చేస్తూ వారిని ఐక్యపరుస్తూ రాజ్యాధికారం అనుభవిస్తున్న నాయకుల జిత్తులమారి ఎత్తుగడలలో విశ్వవిద్యాలయాల్లో చదువుకుంటున్న, చదువుకున్న విద్యార్థులు, యువకులు, తెలంగాణ మేధావి వర్గం పదవులు, డబ్బు ఆశకు పోయి తమ గౌరవాన్ని తామే బలహీన పర్చుకోకుండా తెలంగాణ రాజకీయ బలహీన వర్గాలకు పేద ప్రజలకు అన్యాయం చేయవద్దని బహుజనుల నాయకత్వంలో కొనసాగుతున్న పార్టీలలో చేరి నాయకులుగా తెలంగాణ సమాజానికి సేవ చేయాలని ఆకాంక్షిస్తూ అన్యాయం ఎవడు చేసిన ప్రజల ముందు దోషులుగా నిలబెట్టాలని రాష్ట్రంలో బహుజన వర్గాల నాయకత్వంలో బలపడిన పార్టీలలో ఉన్న బీసీ నాయకుడు ముఖ్యమంత్రి అయితేనే అన్ని సమస్యలకు పరిష్కారం అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని బలంగా నమ్మి ఎలాంటి పదవుల ఆశకు లొంగకుండా బహుజన వర్గాల ప్రజల మేలు కోసం తెలంగాణ రాష్ట్రంలో బిసి ముఖ్యమంత్రి ఏఎజెండాగా త్రికరణశుద్ధిగా ముందుకు కదులుతున్న నీతి నిజాయితీ నిబద్ధత నిస్వార్థంకు మారుపేరై ప్రజల హృదయాల్లో తనకంటూ ప్రత్యేకమైన స్థానాన్ని పదిలపరుచుకున్న నికార్సైన ప్రజల మనిషి డాక్టర్ దాసరి అజయ్ కుమార్ యాదవ్ ఇంకా ఎన్నో ఇలాంటి జన్మ దినోత్సవాలు ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఆనందంగా జరుపుకుంటూ నిస్వార్థమైన నాయకత్వాన్ని నిర్మించుకొని లక్ష్యాన్ని చేరుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# ఎన్.సి.డి. న్యూ యాప్ పైన అవగాహన, జాతీయఆరోగ్య కార్యక్రమాల పైన సమీక్ష


**- డి.ఎం.ఎచ్.ఓ.డా.వాణిశ్రీ**



**అక్షర వేదం ప్రతినిధి:పెద్దపల్లి అక్టోబర్ 06:** ఈరోజు సమగ్ర జిల్లా అధికారుల కార్యాలయ సముదాయం లోని మినీ సమావేశ మందిరం నందు మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్ లకు తెలంగాణ నాన్ కమ్యూనికబుల్ డిసీజెస్ ప్రోగ్రాం యాప్ నిర్వహణ పైన శిక్షణ కార్యక్రమమును మరియు ఎన్.సి.డి ( అసంక్రామిక వ్యాధులు) కార్యక్రమం పై సమీక్ష నిర్వహించామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వి. వాణిశ్రీ అని అన్నారు.ఈ శిక్షణ యందు ఎన్.సి.డీ స్క్రీనింగ్ నిర్వహించినప్పుడు కేసుల వివరాల నమోదు, పరీక్షల వివరాలు , చికిత్స, రెఫరల్ వివరాలు మరియు ఫాలో అప్ చేసిన వివరాలు ఇందులో నమోదు చేస్తారు అని అన్నారు.జాతీయ అసంక్రామిక వ్యాధుల నివారణ కార్యక్రమంలో 12 రకాల ప్రోగ్రాం లు నిర్వహిస్తామని అన్నారు. అందులో ఎన్. సి.డి, పాలియాటివ్ కేర్, ఎల్డర్లీ కేర్, టొబాకో, అయోడిన్ , క్లైమేట్ చేంజ్, మెంటల్ హెల్త్ ప్రోగ్రామ్ లాంటివి నిర్వహిస్తారు అని అన్నారు.ప్రతి గర్భిణీ స్త్రీ ని ప్రభుత్వ దావఖానా లో ప్రసవం అయేలాగా ప్రోత్సహించాలని ఆదేశించారు. ప్రతి క్షయ వ్యాధి గ్రస్తులను మందులను సక్రమంగా వాడేవిదంగా చూడాలని అన్నారు. ఇంటింటికి జ్వరాల సర్వే చేసి చికిత్స అందించండి.ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ అధికారులు డా.ఆర్.రాజమౌళి, డా. బి. శ్రీరాములు, డా. కె. వి. సుధాకర్ రెడ్డి, డా. బి. కిరణ్ కుమార్ లు, ఎన్. సి.డీ. జిల్లా కోఆర్డినేటర్ లు ఎ . మధుసూదన్, టి. రాజేశం, జిల్లా డేటా మేనేజర్ మహీందర్ మరియు ఎం. ఎల్. హెచ్. పి.లు పాల్గొన్నారు. ఎన్ క్వాస్ సర్టిఫికేషన్ కు సిరిపురం ఆరోగ్య ఉప కేంద్రం తనిఖీ అదే విధంగా ఈ రోజు ఉదయం గద్దలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని సిరిపురం ఉపకేంద్రం ను సందర్శించడం జరిగింది అని అన్నారు. నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్డ్స్ కార్యక్రమం క్రింద సిరిపురం ఉప కేంద్రం ను ఎంపిక చేయడానికి ఎక్స్టర్నల్ అసెస్మెంట్ చేయడానికి డిల్లీ నుండి టీం, డా .ప్రశాంత్, డా .కనుప్రియ వచ్చి, పరిశీలించడం జరిగింది అని అన్నారు.

# "న్యూఇండియా పార్టీ"కి షోకాజ్ నోటీస్ జారీ.

**- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**



**అక్షర వేదం ప్రతినిధి:పెద్దపల్లి, అక్టోబర్ -06:** న్యూఇండియా పార్టీకి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి షోకాజ్ నోటీసు జారీ చేసినట్టు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కోయ శ్రీ హర్ష సోమవారం ఒక ప్రకటన లో తెలిపారు. భారత రాజ్యాంగం ప్రకారం 324, ప్రజా ప్రతినిధి చట్టం 1951, సెక్షన్ 29-ఎ ప్రకారం రిజిస్టర్డ్ పార్టీ విధిగా నియామక ఆడిట్ అకౌంట్స్ సమర్పించాలని, అయితే న్యూఇండియా పార్టీ 2021-22, 2022-23, 2023-24 సంవత్సరాల ఆడిట్ అకౌంట్స్ వివరాలను సమర్పించకపోవడం వల్ల షోకాజ్ నోటీసు జారీ చేయడం జరిగిందన్నారు.ప్రతి పార్టీ వార్షిక ఆడిట్ అకౌంట్స్ రిపోర్ట్, ఎన్నికల ఖర్చులకు సంబంధించిన వివరాలను ప్రతియేటా సమర్పించడం తప్పనిసరి అని, సమర్పించకపోయిన పార్టీకి కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా షోకాజ్ నోటీసును ఇచ్చామని, పార్టీ అధికారి లేదా ప్రతినిధి నిర్దిష్ట సమయం లోపు సమాధానం ఇవ్వాలని పేర్కొన్నారు. తమ సమాధానం ఆధారంగా తదుపరి చర్యలు ఉంటాయని, స్పందించకపోతే గుర్తింపు రద్దు చేసే అవకాశముందని కలెక్టర్ స్పష్టం చేశారు. ఇప్పటి వరకు వివరణ ఇవ్వకుండా వున్న ప్రకటనలను దృష్టిలో పెట్టుకుని న్యూఇండియా పార్టీకి ఈ షోకాజ్ నోటీసు జారీ చేయబడిందన్నారు. పార్టీ గుర్తింపునకు సంబంధించిన వివరణకు తదుపరి దశల్లో తగిన చర్యలు తీసుకోబడతాయని కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

# మాజీమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ జన్మదిన వేడుకలు




**అక్షర వేదం, మంచిర్యాల, అక్టోబర్ 6**
మంచిర్యాల జిల్లా కేంద్రంలో నీ కల్వరి యువశక్తి అనాధాశ్రమంలో మాజీ మంత్రి సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు, తెలంగాణ రాష్ట్ర గొర్రెల మేకల పెంపకం వృత్తి దారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కొమ్ము అశోక్ యాదవ్ మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి నిరుపేదల పెన్నిధి అన్నా అంటే నేనున్నా అంటూ ఆపదలో ఆదుకునే మనసున్న మనిషి మాజీ పశుసంవర్ధక శాఖ మంత్రివర్యులు సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ , జన్మదిన వేడుకలు ఈరోజు మంచిర్యాల జిల్లా కేంద్రంలోని కల్వరి యువశక్తి అనాధ ఆశ్రమంలో అనాధలు వృద్ధుల మధ్యలో కేక్ కట్ చేసి ఘనంగా సంబరాలు జరుపుకొని అనంతరం అన్నదాన కార్యక్రమం చేస్తూ దుప్పట్ల పంపిణీ చేయడం జరిగింది అని అన్నారు ఈ కార్యక్రమంలో దాడి రాజబాబు యాదవ్ కల్వరి యువశక్తి ప్రొప్రైటర్ కుమార్, సిరిపురం మధుకర్ , గద్దల శంకర్, జంగాపల్లి శ్రీధర్ పాల్గొన్నారు

# చీఫ్ జస్టిస్ పై దాడిని ఖండిస్తు న్నాము

**రాజ్యాంగ వ్యవస్థలపై గౌరవం కలిగేల చర్యలు తీసుకోవాలి.**

**టి ఎస్ యు టి ఎఫ్**

**అక్షర వేదం/కోరుట్ల అక్టోబర్ 6:**
న్యాయ పరిరక్షణ లో దేశంలో అ త్యున్నత న్యాయ స్థానం అయినా సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి ఆర్ గవాయ్ పై దాడి ప్ర యత్నాన్ని టిఎస్ యుటిఎఫ్ పక్షా న తీవ్రంగా ఖండిస్తున్నాం.కుల దు రహంకారం,మత అసహనమూ నే డు దేశమంతటా రాజ్యమేలుతు న్నాయని ఆ సంఘ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు తిరుకోవెల శ్యామ్ సుందర్,అంబటి భూమేశ్వ ర్ పేర్కొన్నారు. రాజ్యాంగం పట్ల, ప్రజాస్వామ్యం పట్ల, న్యాయవ్యవ స్థ పట్ల ఏమాత్రం గౌరవం లేని అ నాగరిక, అసాంఘిక శక్తులు విచ్చ లవిడిగా విజృంభిస్తున్నాయి. వీటి ని కట్టడి చేయాల్సిన పాలకులు ప్ర త్యక్షంగానో పరోక్షంగానో వారిని ప్రో త్సహిస్తూ ఉండటం ఆందోళన కలి గిస్తున్నది.సిజెఐ పై దాడికి ప్రయ త్నించిన అడ్వకేట్ ను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని టిఎస్ యు టిఎఫ్ డిమాండ్ చేస్తోంది.

# కోరుట్ల బజార్ పోస్ట్ ఆఫీస్ రద్దు పై వినతి పత్రం అందజేత

**- సమాజ్‌వాది పార్టీ రాష్ట్ర కార్య దర్శి మరియు యునైటెడ్ ముస్లిం మైనారిటీ రైట్స్ ఆర్గనైజేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మొహమ్మద్ ముజాహిద్**



**అక్షర వేదం/కోరుట్ల అక్టోబర్ 6:**
కొరుట్ల పట్టణంలో రెండు పోస్టాఫీ సులు ప్రజలకు సేవలు అందిస్తు న్నాయి. అయితే ఇటీవల బజార్ పోస్టాఫీస్‌ను తొలగించనున్న సూ చన బయటకు వచ్చిన తర్వాత స్థానిక ప్రజల్లో తీవ్ర ఆందోళన నెల కొంది.సమాజ్‌వాది పార్టీ రాష్ట్ర కా ర్యదర్శి మరియు యునైటెడ్ ము స్లిం మైనారిటీ రైట్స్ ఆర్గనైజేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మొహ మ్మద్ ముజాహిద్ మాట్లాడుతూ బజార్ పోస్టాఫీస్ అనేది ప్రజల దై నందిన జీవితంలో కీలకమైన సౌక ర్యం,పెన్షన్లు, లేఖలు,పార్సెల్స్ , మ నీ ఆర్డర్లు, వ్యాపారుల సేవలు అ న్నీ ఇక్కడే అందుతున్నాయి. ము ఖ్యంగా పట్టణానికి దూరం నుంచి వచ్చే ప్రజలకు ఇది అత్యంత అవ సరమైన కేంద్రం పోస్టాఫీస్ తొలగిం పు వల్ల వారికే ఎక్కువ ఇబ్బంది ఏ ర్పడుతుంది.అందుకే ప్రభుత్వం వెంటనే ఈ నిర్ణయాన్ని రద్దు చే యాలి అని తెలిపారు.అలాగే ఆ యన ప్రజలను పిలుపునిస్తూ కో రుట్ల బజార్ పోస్టాఫీస్‌ను కాపాడు కోవడం మనందరి బాధ్యత ప్రభు త్వం ప్రజాభిప్రాయాన్ని తీసుకో కుండా ఏ నిర్ణయమూ తీసుకోకూ డదు. మనం అందరం కలసి ఈ అంశంపై గళం వినిపించాలి అన్నా రు.ఈ సందర్భంగా పోస్ట్ మాస్టర్ గంగాధర్ ను కలిసి వినతి పత్రం అందజేయడం జరిగింది.ఈ కార్య క్రమంలో మొహమ్మద్ నసీర్ (ఎం పీజే) పట్టణ అధ్యక్షులు,అబ్దుల్ బారి ఉపాధ్యక్షులు(ఎంపీజే), మరి యు అడ్వకేట్ పసియోద్దీన్ ,నజీబ్ పాల్గొన్నారు.

## పుట్టినరోజు సందర్భంగా ప్రభుత్వ పాఠశాలకు కుర్చీలు బహుకరణ



**అక్షర వేదం, జైపూర్, అక్టోబర్ 6**
జైపూర్ మండలం ముదిగుంట ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల సంఖ్యకు తగ్గట్టుగా దాతలు కుర్చీలు అందజేశారని సోమవారం స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజగోపాల్ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక గ్రామానికి చెందిన ఆకులు రాములు మనవడు గౌతమ్ అద్వైత్ రాజ్ పుట్టినరోజు సందర్భంగా సామాజిక సేవను నిర్వహించారని తెలిపారు.ఆకుల రాములు కూతురు సౌమ్య ,అల్లుడు రాకేష్ తమ కుమారుడి పుట్టినరోజు సందర్భంగా పాఠశాలకు కుర్చీలు అందించి వారి దాతృత్వాన్ని చాటుకున్నారని కొనియాడారు.విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించడానికి గ్రామంలోని ప్రతి ఒక్కరూ వీరిని స్ఫూర్తిగా తీసుకోవాలని స్థానిక ప్రజలను కోరారు.ఈ కార్యక్రమంలో స్థానిక తాజా మాజీ సర్పంచ్ సౌమ్య, బర్తడే అబ్బాయి మేన మామలు ఆకుల రవి కుమార్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

## నేడు ఆకాశంలో అద్భుతం.. కనువిందు చేయనున్న సూపర్ మూన్



**అక్షర వేదం, మంచిర్యాల్,అక్టోబర్ 6**
చంద్రుడు ఇవాళ, రేపు సూపర్ మూన్‌గా కనువిందు చేయనున్నాడు. భూమి చుట్టూ తిరుగుతూ చంద్రుడు కొన్నిసార్లు సమీపంగా వస్తాడు. దీంతో ఈ రెండు రోజుల్లో పౌర్ణమి రోజు కనిపించే చంద్రుడి కంటే అధిక సైజులో కనిపించి వెలుగులు పంచనున్నాడు. నేడు 14 శాతం సైజు, 30 శాతం వెలుగుతో అధికంగా కనిపించనున్నట్లు సమాచారం. అలాగే నవంబర్, డిసెంబర్ నెలల్లో మరో రెండు సూపర్ మూన్‌లు దర్శనమివ్వనున్నట్లు చెబుతున్నారు.

## ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు-2025




**హైదరాబాద్, అక్టోబర్ 06 (అక్షర వేదం) :**
విద్యార్థులను జ్ఞానవంతులుగా మార్చడంలో ఉపాధ్యాయుడి సహకారం అమూల్యమైనదని తెలంగాణ ఉన్నత విద్యా మండలి కార్యదర్శి ప్రొ.శ్రీరామ్ వెంకటేష్ అన్నారు. సోమవారం ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్(టీసీసీ) స్టేట్ చాప్టర్ నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. అమెరికా పర్యటనలో ఉన్న టీసీసీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌నారాయణ్ ముదిరాజ్ ఒక సందేశంలో ఉపాధ్యాయులను గౌరవించడానికి, సమాజానికి వారి గణనీయమైన సహకారాన్ని గుర్తించడానికి ఈరోజు ఒక ప్రత్యేక సందర్భం అని అన్నారు. తెలంగాణ విశ్వవిద్యాలయ స్థాయి నుండి ఒకరు, ఉన్నత పాఠశాల స్థాయి నుండి ఇద్దరు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు–2025 కు ఎంపికయ్యారు. అత్తాపూర్‌లోని ఎస్ఎస్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ ప్రిన్సిపాల్ కె.శ్రావణి, సూపర్ గ్రామర్ హై స్కూల్స్ విద్యా సంస్థల డైరెక్టర్ మహ్మద్ ముబాషీర్ మోయిుద్దీన్, కులీ కుతుబ్షా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఇంగ్లీష్ లాంగ్వేజ్ సీనియర్ లెక్చరర్ డా.కళ్యాణ్ చక్రవర్తి లను ముఖ్య అతిథి ప్రొ.శ్రీరామ్ వెంకటేష్ శాలువా, జ్ఞాపిక, పూలమాల ప్రశంసా పత్రంతో సత్కరించారు. కౌన్సిల్ కో–ఆర్డినేటర్లు జి.వేణుగోపాల్, బిచుకారి సూర్య, జైనాబ్ ఫాతిమా, కరీమా ఖాతున్, ఖుషి కుమారి, రబియా అంజుమ్, ఉపాధ్యాయులు, లెక్చరర్లు అవార్డు గ్రహీతలను సత్కరించి అభినందించారు.

## రాజస్థాన్‌లో జమాత్ సేవలో ఉండగా మహమూద్ సాబ్ మృతి

### - పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు తాజుద్దీన్ పరామర్శ



**అక్షర వేదం /మరిపెడ :-అక్టోబర్ 6.**
రాజస్థాన్ రాష్ట్రంలో జమాత్ సేవలో పాల్గొనేందుకు వారం క్రితం వెళ్లిన జనాబ్ మహమూద్ సాబ్,అనారోగ్యం కారణంగా అక్కడే కన్నుమూశారు. అక్కడే అంత్యక్రియలు నిర్వహించారు. ఈ విషాద సమాచారం అందిన వెంటనే పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తాజుద్దీన్ సోమవారం రామా విలాస్ పూల బజార్ లో వారి కుమారుడు ముక్తార్‌ను పరామర్శించి.. కుటుంబానికి కాంగ్రెస్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సయ్యద్ సర్వర్,యాకూబ్ పాషా,చిల్లంచర్ల సత్తార్ పాషా,బాసిత్ ఖాన్,అహ్మద్ సాబ్,పోస్ట్ యాకూబ్,బాబు మియా,సయ్యద్ పాషా (ఆర్ ఎం పి)తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో కోర్టు తీర్పు కీలకం కానుంది.

**బి. సి ల రిజర్వేషన్ల పట్ల ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు.**
**మేధావులు ప్రభుత్వానికి కొమ్ము కాయడం దురదృష్టకరం.కార్యకర్తల ఏకాభిప్రాయంతోనే అభ్యర్థుల ఎంపిక. మాజీ మంత్రి**



**అక్షర వేదం/వనపర్తి:**
మండల స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశం అధ్యక్షులు కే.మాణిక్యం ఆధ్వర్యములో జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగింది.ఇట్టి సమావేశములో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి నాయకుల,కార్యకర్తల అభిప్రాయాలను సావధానంగా విని శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు.ఈ సందర్భంగా నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ అలవికాని,ఆచరణ సాధ్యం కాని హామీలు ఇచ్చి ప్రజలను రేవంత్ రెడ్డి మోసం చేశారని దుయ్యబట్టారు.బి. సిలను గందరగోళ పరిస్థితులకు గురిచేయడం పట్ల బి.సి.నాయకులు స్పందించకుండా ఉండడం మంచిది కాదని ఆయన అన్నారు. పదవీకాంక్షతో కోదండరాం బృందం నైతిక విలువలు కోల్పోయారని అన్నారు. రైతులు,విద్యార్థులు,మహిళలు ,కార్మికులు, నిరుద్యోగులు తమ తప్పు తెలుసుకున్నారని మరోసారి కె.సి.ఆర్ రావాలని కోరుకుంటున్నారని అన్నారు.నియోజకవర్గంలో జనరల్ స్థానాలలో కూడా ఎస్.టి,బి. సిలకు పదవులు ఇచ్చాం.ప్రభుత్వం ఇప్పుడు 42శాతం రిజర్వేషన్లు అని హంగామా చేస్తున్నారని త 9ఏండ్లలో పాన్ గల్ జనరల్ స్థానాలలో ఎస్.టి బిడ్డను,వనపర్తి మున్సిపాలిటీలో బి.సి.బిడ్డను అందలం ఎక్కించిన ఘనత బి.ఆర్.ఎస్ పార్టీది అని అన్నారు.
ప్రజలు రేవంత్ రెడ్డి అనాలోచిత నిర్ణయాలతో విసిగి పోయారని ఓడినా నిత్యం మనం ప్రజలకు అండగా ఉన్నాము కాబట్టి తప్పక ఆదరిస్తారని అన్నారు.
నియోజకవర్గంలో మెజార్టీ సీట్లు గెలుస్తామని గౌరవ నిరంజన్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమములో భాను ప్రకాశ్ రావు,విజయ్ కుమార్,మతీన్,రఘువర్ధన్ రెడ్డి,రవిప్రకాష్ రెడ్డి,ధర్మా నాయక్, నారాయణ నాయక్ మాధవ్ రెడ్డి,దేవర్ల .నరసింహ,, సుదర్శన్ రెడ్డి,శంకర్ నాయక్, చిట్యాల.రాము, సాయి తదితరులు పాల్గొన్నారు.

# సుప్రీంకోర్టు సీజేఐ గవాయ్‌పై దాడి ప్రజాస్వామ్య మనుగడకే ముప్పు

**మతోన్మాద శక్తుల దుష్టకృత్యంపై: టీపీసీసీ రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి డి. వై. గిరి ఖండన**



**అక్షర వేదం /హైదరాబాద్:- అక్టోబర్ 6 .**
భారత రాజ్యాంగ విలువలను అవమానపరిచే ఘోర సంఘటనగా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై జరిగిన దాడిని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి డి. వై. గిరి తీవ్రంగా ఖండించారు.సనాతన హిందూ ధర్మం పేరుతో ఒక మతోన్మాది అడ్వకేట్, సుప్రీంకోర్టు ప్రాంగణంలోనే సీజేఐ గవాయ్‌పై పాదరక్ష విసరడం అత్యంత దారుణమని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది కేవలం వ్యక్తిగత దాడి కాకుండా దేశ ప్రజాస్వామ్య వ్యవస్థ, రాజ్యాంగ పునాదులపై జరిగిన దాడిగా ఆయన పేర్కొన్నారు.

**"హిందూ మతోన్మాదులే వెనుక ఉన్నారు"**
ఈ ఘటన వెనుక హిందూ మతోన్మాద శక్తుల హస్తం స్పష్టంగా కనిపిస్తోంది. సంఘ్ పరివార్ ఆశ్రయంతో బీజేపీ వీరిని పెంచిపోషిస్తోందని, సనాతన ధర్మాన్ని తామే కాపాడుతున్నామని చెప్పుకునే వీరు, రాజ్యాంగ విలువలను త్రొక్కేస్తున్నారని. ఇది దేశ ప్రజలకు సిగ్గుపడే విషయమన్నారు.

**"గవాయ్‌పై దాడి అంటే రాజ్యాంగంపైనే దాడి"**
సీజేఐ గవాయ్ రాజ్యాంగ పరిరక్షణకు కట్టుబడి ఉన్న న్యాయవేత్త. అంబేద్కర్ చూపిన మార్గంలో నడుస్తున్న ఆయనపై మతోన్మాదుల దాడి దళితులు, వెనుకబడిన వర్గాలపై ఉన్న ద్వేషానికి ప్రతీక. దేశ ప్రజాస్వామ్య పునాదులను కాపాడే ప్రతి భారత పౌరుడు దీనిపై స్పందించాలని గిరి పిలుపునిచ్చారు.

**రాష్ట్రపతి, ప్రధాని, హోం మంత్రి స్పందించాలి**
ఈ ఘటనపై రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ప్రధాన మంత్రి, హోం మంత్రి తక్షణమే స్పందించాలని డి. వై. గిరి డిమాండ్ చేశారు.
"ఇది దేశ న్యాయవ్యవస్థను అవమానపరిచిన ఘోర ఘటన. నిందితుడిని ఫాస్ట్ ట్రాక్ కోర్టులో విచారించి కఠిన శిక్ష విధించాలి," అని అన్నారు. తాను ఈ ఘటనపై భారత రాష్ట్రపతి, ప్రధాన మంత్రి, హోం మంత్రికి ఈ–మెయిల్ ద్వారా విజ్ఞప్తి పంపినట్లు ఆయన తెలిపారు.

**మతోన్మాద శక్తుల కుట్రకు ప్రజలు అప్రమత్తం కావాలి**
దేశంలో మను ధర్మాన్ని తిరిగి స్థాపించాలన్న కాషాయ శక్తుల కుట్ర కొనసాగుతోంది. చాతుర్వర్ణ వ్యవస్థను బలపరచే ప్రయత్నాలు పెరుగుతున్నాయి. ఇది కొత్త భారత్ కాదు ు పాత మను రాజ్యం! రాజ్యాంగ పరిరక్షణ కోసం ప్రతి పౌరుడు ఐక్యంగా నిలవాలి," అని డి. వై. గిరి పిలుపునిచ్చారు.డి. వై. గిరి
టీపీసీసీ రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ ు హైదరాబాద్

# మాట ఇస్తే తప్పని నాయకుడు దుదిల్ల శ్రీధర్ బాబు



**అక్షర వేదం/మంథని సెప్టెంబర్ 6:**
దుద్దిళ్ళ శ్రీధర్ బాబుకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపిన దళిత సంఘాల నాయకులు
ఏప్రిల్ 14వ తేదీ మంథని లో డా. బి.ఆర్. అంబేద్కర్ జయంతి సందర్భంగా దుదిల్ల శ్రీధర్ బాబు అంబేద్కర్ భవనం కోసం,10 లక్షల రూపాయలు సాంక్షన్ చేయించడం జరిగింది. దళిత సంఘాల నాయకులు కోరగా ఈ ఫండ్ సరిపోదు మీరు ఇంకా దీన్ని పెంచాలి అన్న వెంటనే మంత్రి దుదిల్ల శ్రీధర్ బాబుని దళిత సంఘాల నాయకులు కోరగాదుద్దిల్ల శ్రీధర్ బాబు స్పందించి కోటి రూపాయల నిధులు అంబేద్కర్ భవనం కోసం సాంక్షన్ చేయించడం జరిగింది. మంత్రి దుదిల్ల శ్రీధర్ బాబు కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో భాగంగా ఈరోజు డా. బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాలలు వేసి మరియు శ్రీపాద రావు విగ్రహానికి పాలాభిషేకం పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు.అనంతరం అంబేద్కర్ చౌరస్తా లో దుద్దిల్ల శ్రీధర్ బాబు చిత్రపటానికి పాలాభిషేకం చేసి మంథని నియోజకవర్గ దళిత సోదరులు కాంగ్రెస్ పార్టీ పక్షాన ప్రత్యేక కృతజ్ఞతలు తెలపడం జరిగింది.
ఈ కార్యక్రమంలో మంథని ఎస్సీ సెల్ డివిజన్ అధ్యక్షులు మంథని సత్యం, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు మంథని రాకేష్, సీనియర్ నాయకులు మాజీ ఎంపిటిసి సభ్యులు సింగారపు కిష్టయ్య, సీనియర్ నాయకులు నూకల బానయ్య కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# పేద కులాల్లో డాక్టర్ వివేక్ లాంటి వారు పుట్టడమే తక్కువ మన హక్కుల కోసం పోరాడే నాయకుడు ,సహాయం చేసే గుణం



**అక్షర వేదం /మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ నియోజకవర్గం :-అక్టోబర్ 6 .**
పేద కులాల్లో ప్రతిభావంతులు, సమాజం కోసం త్యాగం చేసే నాయకులు పుట్టడం అరుదు. అలాంటి వ్యక్తులు పుట్టినప్పుడు వారిని కాపాడుకోవడం, ప్రోత్సహించడం మన సమాజం యొక్క బాధ్యత. డాక్టర్ వివేక్ లాంటి వారు కేవలం వ్యక్తులు కాదు ు వారు ఆశ, మార్పు, మరియు సమానత్వానికి ప్రతీకలు.ప్రతిభ ఏ కులంలోనైనా పుడుతుంది. కానీ పేద కులాల్లో పుట్టిన ప్రతిభావంతులు అవకాశాల కొరతతో, ఆర్థిక ఇబ్బందులతో, సామాజిక అణచివేతతో వెనుకబడిపోతారు. అలాంటి వారిని గుర్తించి, విద్య, మార్గదర్శనం, మరియు సహాయం అందించడం సమాజం యొక్క కర్తవ్యం.

**పదవుల కోసం రాలేదు ప్రజా సమస్యలు పరిష్కరించడం కోసం వచ్చాడు**
డాక్టర్ వివేక్ లాంటి నాయకులు పదవుల కోసం రాజకీయాల్లోకి రాలేదు. వారు ప్రజల సమస్యలను అర్థం చేసుకుని, వాటికి పరిష్కారం చూపడం కోసం ముందుకు వస్తారు. వారి లక్ష్యం అధికారంలో ఉండటం కాదు, ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడం. ఈ నిబద్ధతే వారిని నిజమైన ప్రజానాయకులుగా నిలబెడుతుంది.

**మన హక్కుల కోసం పోరాడే నాయకుడు**
డాక్టర్ వివేక్ లాంటి నాయకులు తమ వ్యక్తిగత ప్రయోజనాల కోసం కాదు, సమాజం యొక్క హక్కుల కోసం పోరాడుతున్నారు. వారు సమానత్వం, విద్య, మరియు సామాజిక న్యాయం కోసం కృషి చేస్తారు. వారి పోరాటం ప్రతి పేద కుటుంబానికి ఆశను నింపుతుంది.

**సహాయం చేసే గుణం**
సహాయం చేయడం ఒక గుణం మాత్రమే కాదు, అది మనిషితనానికి ప్రతీక. పేద కులాల్లో పుట్టిన ప్రతిభావంతులను ప్రోత్సహించడం, వారికి అవకాశాలు కల్పించడం, మరియు వారి విజయాన్ని సమాజం యొక్క విజయంగా చూడడం మనందరి బాధ్యత. సహాయం చేసే గుణం ఉన్నప్పుడు మాత్రమే సమాజం ముందుకు సాగుతుంది.

**నిజమైన నాయకుడు ు ప్రజా సేవకుడు**
డాక్టర్ వివేక్ లాంటి నాయకులు పుట్టడం అరుదు. కానీ వారు పుట్టినప్పుడు వారిని కాపాడుకోవడం, ప్రోత్సహించడం, మరియు వారి మార్గంలో నడవడం మన సమాజం యొక్క నిజమైన అభివృద్ధికి దారి తీస్తుంది.

## గౌరవప్రదమైన స్థానంలో ఉన్నటువంటి సిజేఐ గవాయ్ పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం

### సత్తుపల్లి ఎమ్మెల్యే రాగమయి దయానంద్ మరియు రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్



**అక్షర వేదం/ఖమ్మం ,సత్తుపల్లి:- అక్టోబర్ 6.**

దేశ చరిత్రలో ఇది ఒక చీకటి రోజు, ఒక గౌరవప్రదమైన స్థానంలో కూర్చున్నటువంటి రాజ్యాంగం కల్పించిన హక్కుతో న్యాయం ధర్మం వైపు నడుస్తున్నటువంటి వ్యక్తి సిజేఐ గవాయ్ , అలాంటి గౌరవప్రదమైన వ్యక్తిపై దాడి చేయటం అనేది మా మనసును ఎంతో కలిచివేసింది. ఇలాంటి దాడులు బెదిరింపులు తమ మీద ఎలాంటి ప్రభావితం చెయ్యలేవని ధైర్యంగా ప్రకటించడం అనేది యావత్ భారతదేశం అంతా తలెత్తుకోవాల్సిన మాట.సిజేఐ గవాయ్ పై దాడి చేసిన వ్యక్తిని వారి వెనకున్న శక్తులని తగిన బుద్ధి చెప్పి భవిష్యత్తులో మళ్లీ ఎవరిపైన ఎలాంటిది పునరావృత్తం కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని గౌరవప్రదమైన స్థానంలో కూర్చున్నటువంటి వారికి జ్యుడీషియల్ సేఫ్టీ సెక్యూరిటీ ఎంతో ముఖ్యమని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ ఆవేదన వ్యక్తం చేసినారు.

## సంవత్సరీకం కార్యక్రమంలో పాల్గొన్న తూటి భాస్కర్ రెడ్డి



**అక్షర వేదం/మహాముత్తారం అక్టోబర్06 :**

మహాముత్తారం మండలం స్థంభంపల్లి(పీకే) గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ మేడిపల్లి సాంబలక్ష్మి - దుర్గాప్రసాద్ దంపతుల కుమారుడు గత సంవత్సరం చనిపోగా సోమవారం అతని సంవత్సరీకం కార్యక్రమంలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి తూటి భాస్కర్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఠాకూర్ రవీందర్లు పాల్గొన్నారు. వారి కుటుంబానికీ ఎప్పుడు అండగా ఉంటామని ధైర్యాన్ని కలిపించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

## కుక్క చేసిన తప్పుకు మేకల కాపరి అరెస్ట్




**అక్షర వేదం /మహాముత్తారం అక్టోబర్ 6 :**

మహాముత్తారం మండలం రెడ్డిపల్లి గ్రామానికి చెందిన అంగోత్ భద్రయ్య వయసు(65) అటవీ జింక మాంసాన్ని తెచ్చుకొనగా ఫారెస్ట్ అధికారులు పట్టుకొని మాంసం స్వాధీనం చేసుకుని అరెస్టు చేసినట్లు పెగడపల్లి ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఏ.వెంకటేశ్వరరావు తెలిపారు. అతడు మేకల కాపరని ప్రతిరోజు తన మేకలను తీసుకొని అడవిలోకి వెళ్తాడని అతని కుక్క జింకను వేటాడి చంపగా తను మాంసాన్ని తెచ్చుకున్నట్లు తెలిపాడు. ఈ సమాచారాన్ని తెలుసుకున్న స్థానిక అటవీశాఖ అధికారులు మేకల కాపరిని పట్టుకొని అరెస్టు చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ అస్సాం ఖాన్, బీట్ ఆఫీసర్ అఖిల్ రెడ్డి బేస్ క్యాంప్ సిబ్బంది పాల్గొన్నారు.

## తెలంగాణ అథ్లెటిక్స్ టెక్నికల్ రెఫర్ కు ముత్తారం మండలం నుండి ఎంపిక




**అక్షర వేదం/ మహా ముత్తారం, అక్టోబర్ 6 :**

తెలంగాణా అథ్లెటిక్స్ టెక్నికల్ రెఫెర్ కు మహముత్తరం మండలం నుండీ ఎంపిక అయిన నాగవత్ జితేందర్ నాయక్,, పసుల రవికుమార్,, హత్కార్ రఘువీర్, లు తేదీ 05/10/2025నుండీ 06/10/2025 రెండు రోజుల నుండీ నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి సెమినార్ క్లాస్ లు పార ఓలంపిక్ రెఫెర్ డా " కె .విజయ గారు చీఫ్ గెస్ట్ గా వచ్చి అథ్లెటిక్స్ లో ఉన్నటువంటి రన్నింగ్, లాంగ్ జంప్, జావలింగ్ త్రో, హడిల్స్, హై జంప్, రెస్ వాక్, డిస్క్ త్రో, కిడ్స్ జావిలింగ్ , గేమ్స్ కోసం హార్షకన్వెన్షన్ హాల్ బస్టాండ్ సర్కిల్ హన్మకొండ జె ఎన్ ఎస్ స్టేడియంలో ప్రాక్టికల్స్ మెలికలా కోసం ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జనరల్ సెక్రటరీ సారంగపాణి, తెలంగాణా టి ఏ ఏ వాసు సార్ పాల్గొన్నారు.

## ఎన్నారై దామోదర్ యాదవ్ అపన్న హస్తం

### హార్ట్ సర్జరీకి 20 వేల రూపాయల ఆర్థిక సాయం



**అక్షర వేదం/ధర్మారం**

కొత్తూరు గ్రామానికి చెందిన మల్లారపు రాజేందర్ కు హైదరాబాద్ లోహార్ట్ సర్జరీ కాగా, అతడికిఎన్ఆర్ఐ కొలుముల దామోదర్ యాదవ్ అండగా నిలిచారు వైద్య ఖర్చులకోసం తన సేవ సంస్థ కొలుమూల ఫౌండేషన్ ద్వారా 20.000 రూపాయల హార్దిక సహాయాన్ని ఫౌండేషన్ గ్రామ ఇంచార్జ్ పుల్లకొల్ల.లింగమూర్తి అందజేశారు. అలాగే సంవత్సరానికి అతడికి అయ్యే మందుల ఖర్చులను భరించనున్నట్లు దామోదర్ యాదవ్ తెలిపారు కాగా రాజేందర్ తల్లిదండ్రులు తన చిన్నతనంలోనే మృతి చెందగా అతడి ఆర్థిక పరిస్థితి బాగా లేకపోవడంతో వారికి దామోదర్ యాదవ్ కష్ట కాలంలో అండగా నిలిచి మానవత్వం చాటుకున్నారు

## జన్మదినం అంటే వేడుక కాదు...

# సామాజీక బాధ్యత..

### ఘనంగా ఎమ్మెల్యే మురళి నాయక్ జన్మదిన వేడుకలు...





**అక్షర వేదం /మహబూబాబాద్:- అక్టోబర్ 6 .**

మహబూబాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే డా"భూక్యా మురళీ నాయక్ జన్మదిన వేడుకలు సామాజిక సేవా కార్యక్రమాలతో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా మహబూబాబాద్ పట్టణ యువజన కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు గడిపెల్లి చరణ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు అజ్మీరా సురేష్ నాయక్ నేతృత్వంలో జిల్లా నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు కలిసి మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు.స్థానిక క్యాంపు కార్యాలయంలో ఉదయం ప్రారంభమైన ఈ శిబిరంలో యువత, మహిళలు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని రక్తదానం చేశారు. జన్మదినం అంటే కేవలం వేడుక కాదు, సమాజానికి ఉపయోగపడే రోజుగా మార్చుకోవాలి అనే ఎమ్మెల్యే మురళీ నాయక్ సిద్ధాంతం మేరకు పార్టీ శ్రేణులు ఈ కార్యక్రమం నిర్వహించారు.రక్తదానానికి ముందుకు వచ్చిన యువతకు ఫోన్ లో ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. చివరగా కేక్ కట్ చేసి ఎమ్మెల్యేకు అభిమానులు శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా సీనియర్ నాయకులు దేవారం ప్రకాష్ రెడ్డి, రమేష్ చందర్ రెడ్డి, అంబటి మహేందర్ రెడ్డి, మిట్ట కంటి రాంరెడ్డి, చిట్టే వెంకన్న,ఖలీల్ పాషా, రమేష్, బోడ రవి,బెల్లంకొండ శ్రీనివాస్, నర్సింగ శ్రీనివాస్, గునిగంటి కమలాకర్, గార్లపాటి సాయి తేజ, రాంపల్లి నవీన్, గొల్లపల్లి మహేందర్, మధు తదితరులు పాల్గొన్నారు

## మృతుని కుటుంబాన్ని పరామర్శించిన ప్రభుత్వ విప్, డిప్యూటి స్పీకర్ .




**అక్షర వేదం/మరిపెడ:-అక్టోబర్ 6.**

మరిపెడ మున్సిపల్ కేంద్రంలో రామా విలాస్ పూల బజార్ కు చెందిన మహముద్ ఇటీవల రాజస్థాన్ రాష్ట్టానికి జమాత్ కు వెళ్లి గుండెపోటుతో మరణించారు. అక్కడే వారికిఅంతక్రియలు నిర్వహించిన కుటుంబ సభ్యులు,ఈ విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్ డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ రామచంద్రనాయక్ మృతుని కుటుంబాన్ని సోమవారం పరామర్శించారు.ఈ సందర్భంగా కుటుంబ సభ్యులతో, మృతుని కుమారుడు ముక్తార్ తో మాట్లాడారు. మృతికి కారణాలు తెలుసుకొని, ఓదార్చారు.బాధిత కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని, కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పెండ్లి రఘువీరారెడ్డి, పట్టణ అధ్యక్షులు తాజుద్దీన్, మైనార్టీ నాయకులు అఫ్జల్,యాకుబ్ పాషా లక్ష్మణ్ నాయక్ బంక ప్రమోద్ అల్వాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## నిరుద్యోగ యువకులకు అక్టోబర్ 8న జాబ్ మేళా నిర్వహణ

### - జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**అక్షర వేదం ప్రతినిధి:పెద్దపల్లి, అక్టోబర్ -06:**

జిల్లాలోని నిరుద్యోగ యువకులకు టెలి పెర్ఫార్మెన్స్ ప్రైవేట్ కంపెనీ లిమిటెడ్ లో ఉద్యోగాలు కల్పించుటకు అక్టోబర్ 8న బుధవారం రోజున ఎంపీడీవో ఆవరణలోని టాస్క్ కేంద్రం వద్ద జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.టెలి పెర్ఫార్మెన్స్ ప్రైవేట్ కంపెనీ లిమిటెడ్ లో కస్టమర్ సర్వీస్ అసోసియేట్ కాంటెంట్ మోడరెటర్ ,అనలిస్ట్ పోస్ట్ లు ఖాళీలు ఉన్నాయని, ఈ పోస్టులకు ఏదైనా డిగ్రీ, బీటెక్ లేదా పిజీ ఉత్తీర్ణత సాధించి ఉండాలని, స్త్రీ పురుషులు దరఖాస్తు చేసుకోవచ్చని, అభ్యర్థుల వయస్సు 18 నుండి 35 సంవత్సరాల లోపు ఉండాలని తెలిపారు.

ఆసక్తి ఉన్నవారు అక్టోబర్ 8న సంబంధిత సర్టిఫికేట్స్ జిరాక్స్ లతో పాటు రేస్ యుమ్ తీసుకొని పాత ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో గల టాస్క్ సెంటర్ నందు నిర్వహించే జాబ్ మేళా లో హాజరు కావాలని మరిన్ని వివరాలకు 9059506807 నందు సంప్రదించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఆ ప్రకటనలో తెలిపారు.

## స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో,బిఆర్ఎస్ ఎన్నికల సన్నాహాక సమావేశం కలదు.

### గౌరవ డోర్నకల్ మాజీ శాసనసభ్యులు డిఎస్ రెడ్యా నాయక్ పాల్గొంటారు





**అక్షర వేదం /మరిపెడ :- అక్టోబర్ 6.**

మరిపెడ మండల కేంద్రంలో.. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో,బిఆర్ఎస్ ఎన్నికల సన్నాహాక సమావేశం కలదు.

**ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా..**

గౌరవ డోర్నకల్ మాజీ శాసనసభ్యులు డిఎస్ రెడ్యా నాయక్ .

మహబూబాబాద్ జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గుడిపూడి నవీన్ రావు పాల్గొన్ననున్నారు,కావున బిఆర్ఎస్ మండల నాయకులు, ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనారిటీ సెల్ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు,గ్రామ పార్టీ అధ్యక్షులు, మాజీ సర్పంచ్లు, మాజీ ఎంపీటిసిలు,గ్రామ స్థాయి నాయకులు,యూత్ నాయకులు,మహిళ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని ఇట్టి కార్యక్రమాన్ని విజయవంతం చెయ్యగలరని మనవి.

సమయం : మధ్యాహ్నం 01:00 గం॥లకు స్థలం: భార్గవ ఫంక్షన్ హాల్,మరిపెడ బి బంగ్లా బిఆర్ఎస్ పార్టీ - మరిపెడ మండల కమిటీ

## ఎమ్మెల్యే భూక్య మురళీ నాయక్ జన్మదినం సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించిన పార్టీ నాయకులు



**అక్షర వేదం/మహబూబాబాద్ నియోజకవర్గం:-అక్టోబర్ 6 .**

మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీ నాయక్ జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి.. కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో కార్యకర్తలు, అభిమానులు వివిధ సేవా కార్యక్రమాల చేసి ఎమ్మెల్యే భూక్య మురళీ నాయక్ జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ముందుగా పార్టీ నాయకులు కేక్ కట్ చేసి ఎమ్మెల్యే భూక్య మురళీ నాయక్ కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మహబూబాబాద్ పట్టణ కేంద్రంలోని నెహ్రూ సెంటర్, మదర్ తెరిసా సెంటర్ లలో మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే భూక్య మురళీ నాయక్ జన్మదిన వేడుక కార్యక్రమానికి పెద్ద ఎత్తున పార్టీ కార్యకర్తలు నాయకులు, ప్రభుత్వ అధికారులు తరలివచ్చారు.డా ఎమ్మెల్యే భూక్య మురళీ నాయక్ నియోజకవర్గంలో సామాన్యుల సమస్యల పరిష్కారం కోసం తాను నిరంతరం పాటుపడుతున్నాడని పార్టీ నాయకులు చెప్పారు. అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించేందుకు లిఎమ్మెల్యే భూక్య మురళీ నాయక్ కృషి చేస్తున్నారన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చూపాలి...

**-కోరుకంటి చందర్**

**-బిఆర్ఎస్ పార్టీ గెలుపే లక్ష్యంగా గులాబీ సైనికులు పని చేయాలి**


**-కాంగ్రెస్ బాకి కార్డు ప్రతి ఇంటికి అందించాలి: రామగుండం మాజీ ఎమ్మెల్యే, పెద్దపల్లి జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కోరుకంటి చందర్**



**అక్షరవేదం /గోదావరిఖని : అక్టోబర్ 06**
రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గులాబీ సైనికులు తమ సత్తా చాటాలని బిఆర్ఎస్ పార్టీ గెలుపు కోసం గులాబీ సైనికులు కృషి చేయాలని
రామగుండం మాజీ ఎమ్మెల్యే,పెద్దపల్లి జిల్లా బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కోరుకంటి చందర్ పిలుపునిచ్చారు.సోమవారం బిఆర్ఎస్ పార్టీ అంతర్గాం మండల ముఖ్య నాయకుల కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం రామగుండంలో జరిగింది. ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ పాల్గొని మాట్లాడుతూ..కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 22 నెలల్లో ప్రజలు అరిగోస పడుతున్నారని అన్నారు. తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణ రైతులను రాజుగా మార్చితే... కాంగ్రెస్ పాలనలో రైతులను రోడ్డుమీదికి తీసుకువచ్చిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి దక్కుతుందని అన్నారు. కెసిఆర్ హయాంలోనే రాష్ట్రం అభివృద్ధి జరిగిందని ప్రతి గ్రామాన్ని సుందరంగా తీర్చిదిద్దిన ఘనత కేసీఆర్కు దక్కుతుందన్నారు. అంతర్గాం ను మండలంగా, ఎంపీడీవో పోలీస్ స్టేషన్ కార్యాలయం భవనాల నిర్మాణం చేసింది తెలంగాణ ప్రభుత్వం అన్నారు. రామగుండం నియోజకవర్గంలో పాలకుర్తి, అంతర్గాం మండలం రైతులకు ప్రతి ఎకరాకు నీరు అందించేందుకు లక్ష్యంతో 60 కోట్లతో మూర్మూర్ వద్ద లిఫ్ట్ ఏర్పాటు చేసింది కేసీఆర్ అని గుర్తు చేశారు. లిఫ్టు ద్వారా 27 ఎల్ 17 ఎల్ ద్వారా ప్రతి ఎకరాకు సాగునీరు అందించే ఆలోచన కేసీఆర్ హయాంలోనే జరిగిందన్నారు. ప్రజలకు కాంగ్రెస్ పార్టీ చేసిన మోసాలను వివరించాలని, కాంగ్రెస్ పార్టీ బాకీ కార్డులను గ్రామంలోని ప్రతి ఇంటికి బిఆర్ఎస్ కార్యకర్తలు అందించాలని సూచించారు. పార్టీకి కార్యకర్తలే బలమని కార్యకర్తలు సైనికుల్లా పని చేసి, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గులాబీ జెండా ఎగురవేయాలని కోరారు.

**మాజీ కార్పోరేటర్ కౌశిక లత,హరి మాట్లాడుతూ...**
ఆడ బిడ్డను ఆశీర్వదించాలని రాబోవు ఎన్నికల్లో అంతర్గాం జడ్పీటీసీగా గెలిపించాలని అన్నారు. అంతర్గాం మండల బి.ఆర్.ఎస్ పార్టీ నాయకుల కార్యకర్తల అండ దండలతో ముందుకు సాగుతామని బిఆర్ఎస్ శ్రేణులను తాము కాపాడుకుంటామని అన్నారు. కార్యకర్తలు గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ చేసిన మోసాలను వివరించాలని ప్రతి ఇంటికి కాంగ్రెస్ పార్టీ బాకి కార్డులు అందించాలన్నారు. ఈ సమావేశం లో బి.ఆర్.ఎస్ పార్టీ నాయకులు గోపు అయిలయ్య యాదవ్, మాజీ డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్ రావు, కొల సంతోష్ గౌడ్, మట్ట లక్ష్మి, బండారి ప్రవీణ్, ధరణి రాజేష్, కొలిపాక మధుకర్ రెడ్డి, ధర్మాజీ కృష్ణ, సందెల మల్లయ్య, కొల్లూరి సతీశ్, రాములు, రమణ రెడ్డి, జె.వి.రాజు, పర్లపల్లి రవి, నిమ్మరాజుల రవి, తుంగపిండి సతీశ్, ఎలుక కోంరయ్య, సదన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా పూర్ణిమ వేడుకలు



**అక్షర వేదం/మంథని,అక్టోబర్ 6:**
ఆశ్వీయుజ మాసంలో వచ్చే పున్నమి రోజున పూజాగరణ ఉత్సవాలు జరుపుకోవడం సనాతన సంప్రదాయంగా వస్తుంది.సోమవారం నాడు రాత్రి పాలలో చంద్రుని ప్రతిబింబాన్ని చూసి సేవించడం అనాది వాస్తు నానవాయితీ.ఈ పాలన స్వీకరిస్తే అంతా శుభం జరుగుతుందని ప్రజల్లో ప్రగాఢ విశ్వాసం నెలకొంది.అమ్మవారి ఆరాధనకు చాలా విశేషమైన రోజు.సాధారణంగా అందరూ దేవీ నవరాత్రులు 9 రోజులు చేస్తే దేవీ ఉపాసకులు అమ్మవారి ఆరాధన ఆశ్వీయుజ శుద్ధ పాడ్యమి నుంచి పూర్ణిమ వరకు 15 రోజుల పాటు చేస్తారు.ఏడాదిలో ఈ పూర్ణిమనాడు మాత్రమే చంద్రుడు పూర్తి 16 కళలతో ప్రకాశిస్తాడు.అందువల్ల సోమవారం రోజు చంద్రుడిని పూజిస్తే ఎంతో పుణ్యం. ఈ శరత్ పూర్ణిమ రోజున చంద్రకిరణాలకు విశేషమైన శక్తి ఉంటుంది.ఈ కిరణాలు శారీరక,మానసిక రుగ్మతలను దూరం చేస్తాయి.అందువల్ల చంద్రకాంతిలో కూర్చుని లలితా సహస్రనామ పారాయణం చేయడం, ఆవుపాలతో చేసిన పరమాన్నం చంద్రుడికి నివేదన చేసి రాత్రంతా చంద్రకాంతిలో ఉంచి,ఉదయాన్నే దాన్ని ప్రసాదంగా స్వీకరిస్తారు. చంద్రకాంతి నుంచి ఈ పౌర్ణమి రోజున అమృతం కురుస్తుందని శాస్త్రం చెబుతోంది. చంద్రకాంతిలో ఉంచిన పరమాన్నం చంద్రకిరణాలలో ఉన్న ఓషధీతత్వాన్ని తనలో ఇముడ్చుకుంటుంది. మర్నాడు ఉదయం పరమాన్నాన్ని కుటుంబసభ్యులందరూ నైవేద్యంగా స్వీకరించాలి. శ్రీకృష్ణుడు పరిపూర్ణావతారం.ఆయనలో 16 కళలున్నాయి.అందుకే ఈ శరత్ పూర్ణిమను బృందావనంలో రాసపూర్ణిమ అంటారు. శ్రీకృష్ణుడు ఈరోజే మహారాసలీల సలిపాడని అంటారు.కృష్ణుడి వేణుగానం విన్న గోపికలు అన్నీ వదిలేసి ఆయన కోసం అడవిలో పరుగెత్తగా కొన్ని వేలమంది కృష్ణులు వేలమంది గోపికలతో ఈ పున్నమి రాత్రి మొత్తం నాట్యం చేశారట.ఈ పూర్ణిమక కోజ గరి పూర్ణిమ అనే పేరు కూడా ఉంది.కోజాగరి పూర్ణిమ రోజున లక్ష్మీదేవిని భక్తితో పూజించడం భక్తుల ప్రగాఢ నమ్మకంగా భావిస్తారు..

# స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సిద్ధంగా ఉండాలి

**- బి ఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు చింతల వెంకటేశ్వర్ రెడ్డి**



**భువనగిరి,అక్షర వేదం**
రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో భువనగిరి, నియోజకవర్గం బీబీనగర్, పోచంపల్లి,మండల కేంద్రంలో పార్టీ,మండల,గ్రామ ముఖ్య నాయకులతో సన్నాహక సమావేశం నిర్వహించడం జరిగింది.ఈ సమావేశం లో భువనగిరి నియోజకవర్గం ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు చింతల వెంకటేశ్వర్ రెడ్డి పాల్గొని మాట్లా డుతూ,రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ప్రతి ఒక్క కార్యకర్త కష్టపడి పనిచేయాలని,గ్రామ స్థాయి నుండి ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలతో,మమేకం కావాలని నాయకులకు సూచించారు. పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో భరోసా కార్డు ప్రజలకు ఇస్తే కాంగ్రెస్ పాలనలో బాకీ కార్డు ఇచ్చిందని అన్నారు. తెలంగాణలో యువత విద్యార్థులు రైతులు మహిళలు కార్మికులు అన్ని వర్గాలను కాంగ్రెస్ బాకీ కార్డుతో మోసం చేసిందని నిరుద్యోగులకు రెండు లక్షల ఉద్యోగాలు బాకీ.పడ్డారని విద్యార్థినులకు స్కూటీ విద్యా భరోసా కార్డు కింద 5 లక్షలు బాకీ జాబ్ క్యాలెండర్ బాకీ రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి ఇంటికి కాంగ్రెస్ బాకీ కార్డును ప్రజల్లోకి తీసుకువెళ్లాలని బిఆర్ఎస్ పార్టీ నిర్ణయం తీసుకుంది. కావున రాబోయే ఎన్నికల్లో పార్టీ బలాన్ని మరింత పెంచేందుకు సమష్టిగా పనిచేసి,పార్టీ గెలుపు కోసం ప్రతి ఒక్కరు అహర్నిశలు కృషి చేయాలని కోరారు.ఈ కార్య క్రమంలో మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ ఎలిమినేటి సందీప్ రెడ్డి జిల్లా అధ్యక్షులు కంచర్ల రామకృష్ణ రెడ్డి పాల్గొన్న బీబీనగర్ మాజీ ఎంపీపీలు,మాజీ ఎంపీటీసీలు మాజీ సర్పంచులు, తదితరులు పాల్గొన్నారు

# ప్రీమియం లీగ్ విజేతగా బంజారా బుల్స్ టీం

**చిన్న శంకరంపేట్ ,అక్షర వేదం**
కామరం తండా ప్రీమియం లీగ్ లో బంజారా బుల్స్ టీం విజయం సాధించింది,
బంజారా బుల్స్ ఎన్ఎస్ బ్రదర్స్ టీమ్ లు ఫైనల్ లో తలపడ్డాయి,నిర్ణీత 12 ఓవర్లలో బంజర బుల్స్ 53 పరుగులకు ఆల్ అవుట్ అయింది, ఎన్ఎస్ బ్రదర్స్ టీం 44 పరుగులకే ఆల్ అవుట్ కావడంతో బంజర బుల్స్ టీం విజయం సాధించి కప్పును కైవసం చేసుకున్నారు ఈ టోర్నమెంట్ ముందుండి నడిపించిన మోహన్ నాయక్ ఆర్గనైజర్స్ గూగులోత్ నరేష్ బానోత్ మోహన్ దావత్ భానుప్రసాద్ సంతోష్ తోపాటు క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.



# స్వచ్ఛంధ సంస్థల 42 వసంతాల విజయోత్సవ వేడుక




**అక్షర వేదం/మంథని,అక్టోబర్ 6:**
మంథని విద్యార్థి యువత వ్యవస్థాపకులు కొండల మారుతి స్వచ్ఛంద సంస్థల 42 వసంతాలు యశస్సు సమాచార వేదిక 40 వసంతాల వేడుకలను విజయ వంతం చేయాలని వారు కోరారు. సోమవారం రోజున సంస్థాగత కార్యాలయం లో సమాచార ఆహ్వాన పత్రిక లను గట్టు నాగన్న ఆవిష్కారించారు.రెండు వేలకు పైగా స్ఫూర్తి ప్రయోజిత కార్యాక్రమాలను,చారిత్రాత్మక సమాచార సంచికల ఆవిష్కరణ ప్రముఖుల సత్కార వీచీకలు గా యశస్సు శ్రేష్ఠ పతాకలై సంస్థ 40 వసంతాలు పూ ర్తి చేసుకున్నాయని ఆయన అన్నారు.అక్టోబర్ 12 ఆదివారం రోజున హైదరాబాద్ లో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ ఆడిటోరియం లో ఉత్సవం నిర్వహిస్తున్నమన్నారు.ఆరోజు ఉదయం పది గంటలకు శ్రేయోభిలాషులందరూ హాజరై ఈ కార్యక్రమాన్ని విజయ వంతం చేయాలని కొండేల మారుతీ కోరారు.ఈ కార్యక్రమంలో గట్టు నాగన్న,తాటి బుచ్చయ్య గౌడ్, రామడుగు మారుతీ రావు, పోరెడ్డి వెంకట రెడ్డి తమ సంఘీభావం ప్రకటించారు..

# పూసల సంఘం భవనానికి నిధులు మంజూరు చేసిన మంత్రి శ్రీధర్ బాబు



**అక్షర వేదం/మంథని,అక్టోబర్ 6:**
మంథని పట్టణంలో పూసల సంఘం భవనానికి మంత్రి నిధుల కింద 20 లక్షల రూపాయలు కేటాయించినందుకు గాను ఆదివారం రోజున హైదరాబాదులోని మంత్రి కార్యాలయంలో మంథని పూసల సంఘం నాయకులు ఐటి,పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు గుంటుపల్లి సమ్మయ్య ,జిల్లా ఉపాధ్యక్షులు పట్టెం నరసయ్య,చేను రవి,కావేటి సమ్మయ్య కావేటి శ్రీనివాస్ కావేటి రవి గుడ్ల గురువేష్ తదితరులు పాల్గొన్నారు..

# దళితుల అభ్యున్నతికి కృషి చేస్తున్న మంత్రి శ్రీధర్ బాబు



**అక్షర వేదం/ మంథని,అక్టోబర్ 6:**
మంథనిలో అంబేద్కర్ భవన నిర్మాణానికి తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు కోటి రూపాయలు మంజూరు చేయడం హర్షించదగ్గ విషయమని దళితుల అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తున్న వ్యక్తి శ్రీధర్ బాబు అని తెలంగాణ నేతకాని సంఘం రాష్ట్ర అధ్యక్షులు సేగ్గం రాజేష్ హర్షం వ్యక్తం చేస్తూ మంత్రి శ్రీధర్ బాబుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు..

# ప్రశ్నించినందుకు దివ్యాంగున్ని చావబాదారు.

**- అతను ఎవరో కాదు మాజీ వికలాంగుల సంక్షేమ శాఖ చైర్మన్.**



**అక్షర వేదం/హన్మకొండ, వరంగల్:-అక్టోబర్ 6.**
హన్మకొండ లో దివ్యాంగునిపై పోలిసుల దాడి.ప్రశ్నించినందుకు దివ్యాంగున్ని చావబాదారు.అతను ఎవరొ కాదు మాజీ వికలాంగుల సంక్షేమ శాఖ చైర్మన్ కంప వినోద్ కుమార్ .అంతటి తో ఆ దివ్యాంగుడు మౌనం వహించకుండా తన లాంటి దివ్యాంగులకు ఇలాంటి పరిస్థితి రాకూడదని ఎదురు తిరిగి ప్రశ్నించాడు.సార్ దయచేసి నాపై దాడి చేయరాదు మా యొక్క వికలాంగుల చట్టం కఠినంగా ఉంటుంది.దాన్ని అనుసరించని మీకు శిక్ష పడుతుంది.దయచేసి వినండి నేను ఒక్కడినే కానీ నాలాంటి దివ్యాంగులు లక్షల్లో ఉన్నారు.వారి చేత మీరు శిక్ష పడవలసి వస్తుంది .అని వేడుకున్నా వినలేదు.పోలిసులు అంటే సమాజాన్ని కాపాడే రక్షకులు మరి వరంగల్ లో నాపై జరుగుతున్నది ఏంటి ఇది కరెక్ట్ కాదు.సభ్య సమాజం సిగ్గుతో తలదించుకునే పరిస్థితి.భారత రాజ్యాంగం సైతం దివ్యాంగులను గౌరవించాలి.దివ్యాంగులను కించపరిచ రాదు.వారి హక్కులకు భంగం కలిగిస్తే క్షమించేది లేదు అని సుప్రీం కోర్టు, భారత రాజ్యాంగం మరి వివరంగా చెప్పిన వినిపించుకోవడం లేదు .